మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

Circulated to Telangana
Published from Jagitial

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 16-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 || సంచిక: 48 Issue: 48

శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు శ్రావణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:02 సూర్యాస్తమయం - సా. 6:37 తిథి చవితి సా. 4:58 వరకు తరువాత పంచమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం హస్త తె. 3:47ం వరకు తరువాత చిత్తా యోగం సాధ్య తె. 4:01ం వరకు కరణం విష్టి సా. 4:58 వరకు బవ తె. 4:51ం వరకు వర్జ్యం ఉ. 11:58 నుండి మ. 1:36 వరకు దుర్ముహూర్తం సా. 4:57 నుండి సా. 5:47 వరకు రాహుకాలం సా. 5:03 నుండి సా. 6:37 వరకు యమగండం మ. 12:20 నుండి మ. 1:54 వరకు గుళికాకాలం మ. 3:29 నుండి సా. 5:03 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:26 నుండి తె. 5:14 వరకు అమృత ఘడియలు రా. 9:43 నుండి రా. 11:21 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:45 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# విద్యార్థులకు ఫ్రీ కోచింగ్

## పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ



**ఎర్రకోటపై నుంచి యువతకు ప్రధాని కీలక ప్రకటన.. దేశాభివృద్ధికి సప్తధార' ప్రకటన**

**ఘనంగా పంద్రాగస్టు వేడుకలు.. దేశప్రజలకు మోదీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు**

భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతకు కీలక ప్రకటన చేశారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నట్లు ప్రకటించారు. కోచింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు మధ్యతరగతి, పేద కుటుంబాలు భారీగా ఖర్చు చేస్తున్న నేపథ్యంలో వారి ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

న్యూఢిల్లీ:దేశంలో అందుబాటులో ఉన్న డిజిటల్ ప్రజా మౌలిక వసతులను వినియోగించుకుని నాణ్యమైన విద్యను యువతకు చేరువ చేయనున్నట్లు వెల్లడించారు. పోటీ పరీక్షల కోచింగ్ కోసం కుటుంబాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. తమ పిల్లలను కోచింగ్ కేంద్రాలకు పంపించకపోతే వారు వెనుకబడిపోతారనే -2 వ పేజీలో...



## వందేమాతరం ఆలపించని కేరళ

**కేంద్రం ప్రోటోకాల్‌కు భిన్నంగా స్వాతంత్ర్య వేడుకలు**

తిరువనంతపురం: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేరళలో రాజకీయ వివాదానికి దారి తీశాయి. జాతీయ గేయం 'వందేమాతరం' ఆలాపనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,486 |
| వెండి (కిలో): | రూ.2,60,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,362 |

## విశ్వవాణి



రసాయనిక శక్తికి బదులుగా రేడియోధార్మిక పదార్థం నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసే కొత్త రకం అణు బ్యాటరీని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సింథటిక్ వజ్రంలో రేడియోధార్మిక కార్బన్-14ను సురక్షితంగా నిక్షిప్తం చేసి, దాని సహజ క్షయ ప్రక్రియ ద్వారా స్వల్ప పరిమాణంలో విద్యుత్‌ను నిరంతరం ఉత్పత్తి చేసేలా ఈ పరికరాన్ని రూపొందించారు.



# మీ బతుకులు చెడ

**బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు.. మేం మొన్న పాలపిట్ట చీరలు ఇచ్చినం**

**ఈసారి చిలకపచ్చ చీరలు ఇస్తం.. మట్టిలో కలిసేదాకా మాటమీద నిలబడతా**

**సంగారెడ్డి సభలో సీఎం రేవంత్ రెడ్డి.. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం**

బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు నొక్కారని గత బీఆర్ఎస్ సర్కారుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో 'మీ బతుకులు చెడ' అంటూ తీవ్ర పదజాలాన్ని ఉపయోగించారు. శనివారం సంగారెడ్డిలో పర్యటించిన రేవంత్ రెడ్డి.. నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

సంగారెడ్డి, ఆగస్టు 15 (ఈవార్తలు): ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ లో 1.06 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో వీటిని రూపొందించినట్లు పేర్కొన్నారు. దేశంలో సన్నబియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ధీమా వ్యక్తం చేశారు. పేదలకు రూ.14,800 కోట్లతో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నట్లు సీఎం చెప్పుకొచ్చారు. 'గత ప్రభుత్వం పదేళ్లపాటు రేషన్ కార్డులు ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాకే ఇవ్వడం తరువాయి 2 వ పేజీలో...

# గివ్వేం చిల్లర రాజకీయాలు?



## పోచారం వల్లే కాంగ్రెస్ పతనం

**దానంను చూస్తే గౌరవం పోతుంది.. స్వరం పెంచిన రాజగోపాల్ రెడ్డి**

**ముందు రేవంత్‌కు నీతులు చెప్పు.. టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌కు చురకలు**

కాంగ్రెస్ సర్కార్ వ్యవహారశైలిపై సొంత పార్టీ ఎమ్మెల్యే కోమటి రాజగోపాల్ రెడ్డి మరోసారి బహిరంగ విమర్శలు చేశారు. రాజగోపాల్ రెడ్డి హద్దు మీరి మాట్లాడవద్దని, తన లిమిట్స్ లో ఉండాలంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ హెచ్చరించగా.. రాజగోపాల్ రెడ్డి అంతే ఘాటుగా స్పందించారు. నేను పార్టీ లైన్ దాటలేదని, వ్యక్తిగతంగా తాను ఎవరినీ విమర్శించలేదన్నారు.

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): తన మాటలను మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకువెళ్లినా ఇబ్బందేమీ లేదని స్పష్టం చేశారు. చేరికల విషయంలో గతంలో కేసీఆర్ చేసిన తప్పిదాన్నే కాంగ్రెస్ చేస్తోందని, ఎంఐఎం, సీపీఐ సపోర్టు ఉండగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవాల్సిన అవసరం ఏమొచ్చిదని సొంత నేతలపై విరుచుకుపడ్డారు. ఓ న్యూస్ చానల్‌తో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. పోచారం శ్రీనివాస్ రెడ్డి, దానం నాగేందర్ చేరికలపై ఘాటుగా రియాక్ట్ అయ్యారు. బీఆర్ఎస్ బీ-ఫామ్ పై గెలిచిన తరువాయి 2 వ పేజీలో...



# రాజగోపాల్ రెడ్డి కరెక్ట్

**ఆయన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా.. దీన్నిబట్టే కాంగ్రెస్ పాలన అర్థమైతుంది**

**ఏఐసీసీకి ఏటీఎంగా తెలంగాణ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బట్టబయలు చేస్తున్నారని అన్నారు. తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం తరువాయి 2 వ పేజీలో...



# బీఆర్ఎస్‌లోకి జీవితంలో వెళ్లను

## టీఆర్ఎస్ చీఫ్ కవిత కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించడం తమ ప్రధాన అజెండా కాదని తెలంగాణ రక్షణసేన చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడుతూ.. తన రాజకీయ భవిష్యత్తు, బీఆర్ఎస్ నుంచి బహిష్కరణ, నూతన పార్టీ సిద్ధాంతాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు ఈ రోజు ఉన్న గుర్తింపంతా కేసీఆర్ వల్ల వచ్చినదే అయినప్పటికీ, బీఆర్ఎస్ నుంచి తనను ఎందుకు తొలగించారో ఇప్పటికీ అర్థం కావడం లేదని ఆమె పేర్కొన్నారు. పార్టీలో కానీ, తరువాయి 2 వ పేజీలో...

# కులాన్ని చూసే ఉద్యోగం!

**ప్రభుత్వ ఉద్యోగుల ఇంటర్వ్యూల్లో 90 శాతం అవినీతి: యోగా రామ్‌దేవ్**



దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువతలో పెరుగుతున్న నిరసనలపై యోగా గురువు బాబా రామ్‌దేవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్య, ఉపాధి రంగాల్లోని లోపాలే ఆందోళనలకు తీవ్ర కారణం అవుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియలో ముఖ్యంగా ఇంటర్వ్యూల సమయంలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు.

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగాల ఇంటర్వ్యూల్లో 90 శాతం అవినీతి జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పతంజలి యోగపీఠంలో నిర్వహించిన కార్యక్రమంలో రామ్‌దేవ్ మాట్లాడారు. జార్ఖండ్ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు రోడ్డెక్కడం వెనుక విద్యా వ్యవస్థలోని సమస్యలు ఉన్నాయని రామ్‌దేవ్ చెప్పారు. -2 వ పేజీలో...

# మస్తు తాగుతుండ్రు!

**రాష్ట్రంలో మద్యం అమ్మకాల జోరు**

**నిమిషానికి 5,200 బాటిళ్ల అమ్మకాలు**

**4 నెలల్లో రూ.14,668 కోట్ల బిజినెస్**



హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): రాష్ట్రంలో మందుబాబులు బాటిళ్లకు బాటిళ్లు ఖాళీ చేసేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు రాష్ట్రంలో ప్రతీ నిమిషానికి సగటున 5200 బీర్లు.. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) బాటిళ్లు అమ్ముడైనట్లు తెలంగాణ ఎక్సైజ్ శాఖ విక్రయాల గణాంకాల ఆధారంగా వెల్లడైంది. వీటిలో సుమారు 3,600 బాటిళ్లు మద్యం కాగా.. మరో 1,600 బాటిళ్లు బీర్లు కావడం గమనార్హం. ఈ 4 నెలల వ్యవధిలో తెలంగాణలో - 2 వ పేజీలో...



# కేసుల పరిష్కారంలో డిస్టింక్షన్

**ఏడాదిలో 88.56 శాతం క్లియర్ ..హైకోర్టు చీఫ్ జస్టిస్ వెల్లడి**

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): కేసులను పరిష్కరించే విషయంలో తెలంగాణ హైకోర్టు దూకుడు కొనసాగిస్తోంది. గత ఏడాది కాలంలో నమోదైన కేసుల్లో 88.56 శాతం కేసులను పరిష్కరించినట్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హైకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయవ్యవస్థ మరింత నిబద్ధతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన ఆదర్శాలను మరోసారి గుర్తుచేసుకున్న సీజే అపరేశ్ కుమార్తరువాయి 2 వ పేజీలో...



# నీకో దండం.. మమ్మలి వదిలేయ్!

**దయచేసి మా జోలికి రావద్దు**

**ఇరాన్‌కు యూఏఈ విన్నపాలు**

**2 టన్నుల బంగారం, రూ.28,600 కోట్లు, 15 విమానాలు విడుదల**

## రాశి ఫలాలు
16.8.2026

మేషం: సమాజంలో ప్రముఖులతో చర్చలకు అనుకూలమైన రోజు. వృత్తి వ్యాపారాలలో తీసుకున్న నిర్ణయాలు అనుకూలంగా సాగుతాయి. ఆలోచనలు అనుకూలంగా సాగుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. భూ సంబంధిత క్రయ విక్రయాలు లాభిస్తాయి. ఉద్యోగమున సమస్యలు అధిగమిస్తారు.

వృషభం: చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ప్రయాణాలలో ఆకస్మిక మార్పులు తప్పవు. ఆరోగ్య విషయంలో కొంత శ్రద్ధ అవసరం. ఆకస్మిక ధనవ్యయ సూచనలు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి, ఉద్యోగాలు అంతగా రాణించవు. వ్యాపారమున కీలక సమయంలో నిర్ణయాలు తీసుకోలేరు.

మిధునం: ఆర్థిక ఇబ్బందులు బాధిస్తాయి. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి అధికమవుతుంది. కుటుంబ బాధ్యతలు మరింత చికాకు పరుస్తాయి. బంధుమిత్రులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. నిరుద్యోగులకు నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఉద్యోగమున కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: బంధు మిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ముఖ్యమైన పనులలో అవరోధాలు కలిగిన అధిగమించి ముందుకు సాగుతారు. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. కుటుంబ సభ్యుల ఆదరణ పెరుగుతుంది. ఉద్యోగమున ఆలోచించి ముందుకు సాగడం మంచిది.

సింహం: కీలక సమయంలో బంధు మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో పరిస్థితులు అనుకూలంగా మారుతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో అనుకూలత పెరుగుతుంది.

కన్య: దీర్ఘకాలిక ఋణబాధలు తొలగుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. కుటుంబమున అవసరానికి కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన వ్యవహారాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగాలలో అధికారుల అనుగ్రహం కలుగుతుంది.

తుల: ఋణ దాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. మానసిక సమస్యలు చికాకు పరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వేయడం మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి.

వృశ్చికం: చేపట్టిన పనులు శ్రమాధిక్యతతో కానీ పూర్తి కావు. ఆత్మ విశ్వాసంతో వివాదాల నుంచి బయటపడతారు. దూరప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపారాలలో ఇబ్బందులు ఎదురైనా అధిగమించి లాభాలు అందుకుంటారు. ఉద్యోగమున ధైర్యముగా నిర్ణయాలు చేస్తారు. ఆదాయం బాగుంటుంది.

ధనస్సు: ఇతరుల వ్యవహారాలలో తలదూర్చడం మంచిది కాదు. మీ ఆలోచనలు కుటుంబ సభ్యులకు నచ్చే విధంగా ఉండవు. చేపట్టిన పనులు మధ్యలో నిలిపివేస్తారు. ఆర్థిక పరంగా ఇబ్బందులు మరింత బాధిస్తాయి. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటాయి.

మకరం: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. దాయాదులతో భూ సంబంధిత వివాదాలు కొలిక్కి వస్తాయి. బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో విశేషంగా పాల్గొంటారు. ఉద్యోగమున వివాదాలు పరిష్కరించుకుంటారు. వృత్తి వ్యాపారాలలో ప్రయత్నాలు ఫలిస్తాయి.

కుంభం: చేపట్టిన పనులు నత్తనడకన సాగుతాయి. వృథా ఖర్చుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారమున భాగస్తులతో చిన్నపాటి వివాదాలు తప్పవు. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఉద్యోగమున అధికారులతో వివాదాలు కలిగే సూచనలున్నవి.

మీనం: అనారోగ్య సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. కొన్ని వ్యవహారాలలో ఇతరుల సహాయ సహకారాలు అందుతాయి. ధనదాయం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు అనుకూల ఫలితాలను ఇస్తాయి. సంతాన విద్యా విషయాల పట్ల సంతృప్తికరంగా సాగుతాయి.

# విద్యార్థులకు ఫ్రీ కోచింగ్

మొదటి పేజీ తరువాయి

భావన తల్లిదండ్రుల్లో పెరుగుతోందన్నారు. చదువుల కోసం యువత కుటుంబాలకు దూరంగా వెళ్లాల్సిన పరిస్థితిని కూడా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, విద్యావేత్తల సేవలను ఉపయోగించుకుని ఉచిత ఆన్‌లైన్ శిక్షణను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యా వనరులు అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

అభివృద్ధికి 'సప్తధార'

దేశ ప్రగతికి 'సప్తధార' పేరుతో ఏడు కీలక రంగాలను ప్రధాని మోదీ ప్రకటించారు. గత ఐదు నుంచి ఏడు దశాబ్దాల్లో సాధించలేనిదాన్ని వచ్చే ఐదు నుంచి ఏడు సంవత్సరాల్లో సాధించాలన్న లక్ష్యంతో ఈ ఏడు ధారలను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. యువత ప్రతిభ, శక్తి, ఉత్సాహాన్ని దేశ నిర్మాణానికి పూర్తిస్థాయిలో వినియోగిస్తామని చెప్పారు. తయారీ రంగం: తయారీ రంగాన్ని దేశ భవిష్యత్తుకు వృద్ధి ఇంజిన్‌గా అభివర్ణించారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో భారత్ కీలక కేంద్రంగా మారాలని పిలుపునిచ్చారు. ఉత్పత్తుల ధర, నాణ్యత, పరిమాణంతోపాటు ప్యాకేజింగ్, కచ్చితత్వంపై దృష్టి పెట్టాలని సూచించారు.

వ్యవసాయం: వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాన్ని రెండో ధారగా పేర్కొన్నారు. భారత రైతుల ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు చేరాలని ఆకాంక్షించారు. చిరుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలు, సంప్రదాయ ఆహార ఉత్పత్తులను అంతర్జాతీయ బ్రాండ్లుగా తీర్చిదిద్దాలని అన్నారు.

సాంకేతికత: డేటా కేంద్రాలు, రోబోటిక్స్, కృత్రిమ మేధ, తదితర ఆధునిక సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచ కేంద్రంగా ఎదగాలని పిలుపునిచ్చారు. యూపీఐ, డిజిటల్ ప్రజా మౌలిక వసతుల్లో భారత్ సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ తదుపరి తరం సమాచార సాంకేతికతలోనూ ముందుండాలని అన్నారు.

గతిశక్తి: దేశవ్యాప్తంగా వేగవంతమైన రవాణా, అనుసంధాన వ్యవస్థలను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. కొత్త రహదారులు, రహదారి మార్గాలు, వేగవంతమైన అనుసంధాన వ్యవస్థలతో వ్యాపార రంగానికి ఊతమివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

రక్షణ శక్తి: రక్షణ ఉత్పత్తుల తయారీలో స్వావలంబన సాధించాలని ప్రధాని అన్నారు. డ్రోన్లు, వాటిని ఎదుర్కొనే సాంకేతికత వంటి ఆధునిక రక్షణ రంగాల్లో భారత్ పెట్టుబడులు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

హరిత ఇంధనం: కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావరణహిత అభివృద్ధి సాధించేందుకు హరిత ఇంధన రంగంలో కొత్త ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

మృదుశక్తి: యోగా, చేతివృత్తులు, సినిమా, చిత్ర యానిమేషన్, ఆటల రూపకల్పన, డిజిటల్ కంటెంట్, సృజనాత్మక రంగాలను భారత మృదుశక్తికి బలమైన ఆధారాలుగా పేర్కొన్నారు. అంతర్జాతీయ పర్యాటకులను భారీ స్థాయిలో ఆకర్షించే సామర్థ్యం భారత్‌కు ఉందన్నారు.

అణు విద్యుత్‌పై భారీ లక్ష్యం

దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు అణు విద్యుత్ రంగంలో వేగంగా ముందుకు సాగనున్నట్లు ప్రధాని ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో ఐదు కొత్త అణు విద్యుత్ కేంద్రాలను నిర్మించనున్నట్లు తెలిపారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. సౌర విద్యుత్ ఉత్పత్తిని కూడా భారీగా పెంచినట్లు చెప్పారు. హైడ్రోజన్ రైలు వంటి ఆధునిక రవాణా సాంకేతికతల్లో భారత్ అడుగులు వేస్తోందన్నారు. 2014 తర్వాత పలు దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నామని ప్రధాని తెలిపారు. వస్త్ర, ఔషధ, మత్స్య రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలంగా నిలుస్తున్నాయని చెప్పారు. సెమీకండక్టర్ తయారీ కేంద్రాలు రాబోయే సంవత్సరాల్లో సత్ఫలితాలు ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కీలక ఖనిజాల ఉత్పత్తిని పెంచడంతోపాటు వాటి కోసం వివిధ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. జనగణన కేవలం జనాభా లెక్కింపు మాత్రమే కాదని, భవిష్యత్ విధానాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలకు కచ్చితమైన సమాచారం ఎంతో కీలకమని చెప్పారు. ప్రతి కుటుంబం ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కోరారు.

నక్సలిజానికి చరమగీతం

మావోయిస్టు హింసపై కూడా ప్రధాని కీలక వ్యాఖ్యలు చేశారు. నక్సలిజం కారణంగా ఎన్నో ఏళ్ల పాటు యువత భవిష్యత్తు దెబ్బతిన్నదన్నారు. ప్రస్తుతం మావోయిస్టు హింస చివరి దశలో ఉందని పేర్కొంటూ, నక్సల్ భావజాలాన్ని గుర్తించి దూరం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఇక, ఆత్మనిర్భర్ భారత్ సాధనే దేశ లక్ష్యమని ప్రధాని స్పష్టం చేశారు. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవడంతోపాటు స్వయం సమృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. 'స్థానిక ఉత్పత్తులకు ప్రాధాన్యం' అనే భావనతో ముందుకు సాగాలని సూచించారు. దేశ యువత, మహిళలు, రైతులు, కార్మికులపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. రానున్న కాలంలో మరిన్ని సంస్కరణలు తీసుకురానున్నట్లు ప్రకటించారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోందని, ప్రపంచం దేశం సాధిస్తున్న చారిత్రక విజయాలను గమనిస్తోందని ప్రధాని అన్నారు. దృఢమైన సంకల్పంతో ముందుకు సాగితే కఠిన సవాళ్లను సైతం అధిగమించగలమని పేర్కొన్నారు. వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో యువతే కీలక శక్తిగా నిలవాలని పిలుపునిచ్చారు.

# గివ్వేం చిల్లర రాజకీయాలు?

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి తీసుకోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చినోళ్లకు, చేర్చుకున్నోళ్లకు బుద్ధిలేదంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. గతంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పీకర్ స్థానంలో ఉండి కాంగ్రెస్ పార్టీ నాశనం అయ్యేలా వ్యవహరించారని అలాంటి వ్యక్తిని పార్టీలోకి ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పతనానికి కేసీఆర్ నంబర్ వన్ అయితే నెంబర్ టూ పోచారమేనని అలాంటి వ్యక్తి కాంగ్రెస్ పార్టీలోకి ఎందుకు వచ్చారు? ఆయన్ను ఎవరు రప్పించారని ప్రశ్నించారు. పార్టీలో చేరాక ఇప్పుడు తనకు బాధ అనిపిస్తోందని పోచారం మాట్లాడడం విడ్డూరంగా ఉందని అలాంటప్పుడు ఆయన్ను పార్టీలో ఎవరు ఉండమన్నారు వెళ్లిపోవాలన్నారు. ఇక దానం నాగేందర్ లాంటి వాళ్లను చూస్తే జనాల్లో రాజకీయ నాయకుల మీద ఉండే గౌరవం పోతుందని ఆయన బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచి, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేశారన్నారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని అంటున్నాడు. ఇదేం చిల్లర రాజకీయం అని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా కాంగ్రెస్ పార్టీకి నష్టం చేసిన వారిని పార్టీలోకి చేర్చుకోవద్దన్నారు. పార్టీ బలోపేతం చేర్చుకోవద్దన్నారు. చేరికల విషయంలో కాంగ్రెస్ హైకమాండ్‌కు అన్ని తెలుసన్నారు. మహేశ్ కుమార్ గౌడ్ తనకు చెప్పే బదులు చేరికలపై మనం తప్పు చేస్తున్నామని, మన పార్టీ గౌరవం కాపాడుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెప్పాలన్నారు. ఇప్పటికైనా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఉద్యమకారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అవినీతి రహిత ప్రజాపాలన అందించాలని కోరుకుంటున్నానన్నారు.

# రాజగోపాల్ రెడ్డి కరెక్ట్

మొదటి పేజీ తరువాయి

ఏఐసీసీకి ఏటీఎంగా మార్చిందని ఆరోపించారు. దీనిపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేటీఆర్ శనివారం రోజున తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... తెలంగాణలో అవినీతి, అక్రమాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఇప్పుడు ప్రతిపక్షాలు చెప్పడం మాత్రమే కాదని... అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే బహిరంగంగా వెల్లడిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని ఆయన తెలిపారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధే ప్రభుత్వ పెద్దలపై అవినీతి ఆరోపణలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందంటే తెలంగాణలో పాలన ఎంత దారుణంగా మారిందో అర్థం చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. ఇన్నాళ్లూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలు... ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల నోటి నుంచి వస్తున్నాయని చెప్పారు. తెలంగాణను ఏఐసీసీకి ఏటీఎంగా మార్చారన్న ఆరోపణలు ప్రధానమంత్రి స్థాయి నుంచి వస్తున్నప్పుడు... కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం ఎన్నికల సమయంలో లేదా రాజకీయ వేదికలపై అవినీతి ఆరోపణలు చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం లేదని, ఆరోపణల్లో వాస్తవం ఉంటే కేంద్ర దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిజాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహించిందని... ఆ తర్వాత ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో, విచారణ ఎక్కడికి చేరిందో స్పష్టత ఇవ్వలేదని అన్నారు.

# మీ బతుకులు చెడ

మొదటి పేజీ తరువాయి

ప్రారంభించాం. రేషన్ విషయంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యాన్ని ఎవరూ తినేవారు కాదు.. పైగా పక్కదారి పట్టేవి. పేదల ఆకలి తీర్చేదే ఈ స్మార్ట్ రేషన్ కార్డు. అసలు రేషన్ షాపులు తెచ్చిందే కాంగ్రెస్. పేదలకు కూడు, గూడు, గుడ్డ ఉండాలని ఇందిరమ్మ ఆలోచన చేశారు. వారికి సంక్షేమం అందించడం మా బాధ్యత. బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరు కాదు.. రెండూ ఒక్కటే. గతంలో ఆ పార్టీలు ఎప్పుడైనా సన్నబియ్యం ఇవ్వాలని ఆలోచించాయా?. రేషన్ కార్డు అనేది పేదల ఆత్మగౌరవం. వారికి ప్రతినెలా 6 కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తున్నాం. దీని వల్లే మార్కెట్‌లో బియ్యం ధరలు తగ్గాయి. రైతులకు ఎవరేం చేశారో అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా? పదేళ్లలో మీరేం చేశారో.. రెండున్నరేళ్లలో మేమేం చేశామో చర్చిద్దాం. అతి తక్కువ అప్పుల్లో తెలంగాణ రైతులు ఉన్నారని కేంద్రం చెబుతోంది. కేంద్రం చెప్పేది బీజేపీ నేతలకు కనిపించడం లేదా?. రైతులు పండించిన వడ్లకు రూ.90 వేల కోట్లు బదిలీ చేశాం. ఉచిత విద్యుత్ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేశాం. మీ బతుకులు చెడ. బతుకమ్మ చీరల్లోనూ కమీషన్లు నొక్కారు. మేం గతంలో పాలపిట్ట చీరలు ఇచ్చాం.. ఈసారి చిలకపచ్చ చీరలు ఇస్తాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు కోసం రూ.11 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్ అంటూ డబ్బా కొట్టారు. పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు రాలేదు కానీ వారికి మాత్రం ఫామ్‌హౌస్‌లు వచ్చాయి. మేము 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తున్నాం. తెలంగాణలో ఇందిరమ్మ ఇల్లు లేని ఊరేలేదు. కొత్తగా 2.5 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేశాం. అర్హులైన చేనేత, గీత కార్మికులందరికీ పెన్షన్లు ఇస్తాం. ఐదేళ్లపాటు మహిళలకు మంత్రి పదవి ఇవ్వనివారు నేడు మహిళల గురించి మాట్లాడుతున్నారు. కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలు వచ్చాయి. నిరుద్యోగులకు మాత్రం ఉద్యోగాలు రాలేదు. త్వరలోనే ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. అగ్గిపెట్టె రావు, అఘోరా రావులు వస్తారు.. జాగ్రత్త. వీళ్లకు అగ్గిపెట్టెలు దొరకవు కానీ అమాయక యువతను మాత్రం బలిచేశారు. శవాలపై పెట్టుబడులు పెట్టి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. మాట ఇస్తే మట్టిలో కలిసే వరకు నిలబడి ఉంటా. ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేసేందుకు చిత్తశుద్ధితో ఉన్నాం. దుర్మార్గులు, దుష్టులు మాయమాటలతో వస్తారు. యువత అప్రమత్తంగా ఉండాలి. మాయమాటలను నమ్మొద్దు. బీఆర్ఎస్ వాళ్లు చేసిన అప్పులకు రూ.75 వేల కోట్ల వడ్డీ కడుతున్నాం. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపిస్తున్నాం' అని పేర్కొన్నారు.

### కేసీఆర్.. అసెంబ్లీకి రా

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మేలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అన్యాయాలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని అన్నారు. ఫామ్‌హౌస్‌లో ఉండి విమర్శలు చేయడం కాదని, ప్రజల ముందుకు వచ్చి మాట్లాడాలని అన్నారు. గతంలో వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో మాత్రం వరి పండించారని రేవంత్ విమర్శించారు. ఇప్పుడు రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపడుతుంటే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోందన్నారు. రైతుల సంక్షేమంపై నిజమైన చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ వేదికగా మాట్లాడుకుందామని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్, బీజేపీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని రేవంత్ అన్నారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి బొమ్మా బొరుసులాంటివని వ్యాఖ్యానించారు.

# కేసుల పరిష్కారంలో డిస్టింక్షన్

మొదటి పేజీ తరువాయి

సింగ్.. రాజ్యాంగంపై విశ్వాసాన్ని ఉంచుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే సంస్థలను మరింత బలోపేతం చేయడంతో పాటు ఐక్యత, కరుణ, సమష్టి బాధ్యతతో ప్రజలకు సేవ చేయాలని పేర్కొన్నారు. కేసులను వేగంగా పరిష్కరించడానికి బెంచ్‌తో పాటు బార్ సహకారం కూడా ఎంతో కీలకమని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ న్యాయవ్యవస్థ మౌలిక వసతులు, మానవ వనరులు, సాంకేతికత పరంగా ఈ ఏడాది చేపట్టిన పలు కార్యక్రమాలను ఈ సందర్భంగా సీజే అపరేశ్ కుమార్ సింగ్ వివరించారు. రాజేంద్రనగర్‌లో నిర్మిస్తున్న కొత్త హైకోర్టు భవన సముదాయంలోని జోన్-2కు శంకుస్థాపన జరిగిందని.. నిర్మాణ పనులు సుమారు 20.25 శాతం పూర్తి అయినట్లు తెలిపారు. విద్యార్థుల్లో న్యాయ అవగాహన పెంచేందుకు పాఠశాల విద్యాశాఖతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ద్వారా 1,753 మంది ఉపాధ్యాయులకు బాలల హక్కులు, చట్టాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ చెప్పారు. బాలికల హక్కులు, గౌరవం, రక్షణపై అవగాహన కోసం 500 మందికి పైగా విద్యార్థినులతో 2కే రన్ నిర్వహించినట్లు వెల్లడించారు. మరోవైపు.. న్యాయవ్యవస్థలో టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు.

# మస్తు తాగుతుండ్రు!

మొదటి పేజీ తరువాయి

బీర్, ఐఎంఎఫ్ఎల్ కలిపి సుమారు 3.5 కోట్ల కేసుల విక్రయాలు నమోదయ్యాయి. వీటి మొత్తం విలువ దాదాపు రూ.14,668 కోట్లు. ఇందులో బీర్ విక్రయాలు సుమారు 2.21 కోట్ల కేసులు ఉండగా, ఐఎంఎఫ్ఎల్ విక్రయాలు 1.29 కోట్ల కేసులుగా నమోదయ్యాయి. ఇక బీర్ కేసుల సంఖ్య కంటే మద్యం బాటిళ్ల పరిమాణాన్ని పరిశీలిస్తే మందు అమ్మకాలు ఏ రేంజ్‌లో ఉన్నాయో మరింత స్పష్టమవుతుంది. వివిధ ప్యాక్ సైజులను లెక్కలోకి తీసుకుంటే ఏప్రిల్-జూలై నెలల మధ్య సుమారు 91.5 కోట్ల బాటిళ్లు.. అంటే దాదాపు 28.4 కోట్ల లీటర్ల మద్యం విక్రయమైనట్లు ఎక్సైజ్ శాఖ అంచనా వేశారు. అంటే ప్రతి నిమిషానికి సుమారు 1600 లీటర్ల మద్యం మార్కెట్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇందులో దాదాపు 980 లీటర్లు బీర్, 635 లీటర్లు ఐఎంఎఫ్ఎల్ ఉన్నట్లు వెల్లడైంది. నెలల వారీగా చూస్తే మద్యం విక్రయాల్లో కొన్ని ఎక్కువ తక్కువలు కనిపిస్తున్నాయి. ఏప్రిల్ నెలలో నిమిషానికి సుమారు 5,100 బాటిళ్లు అమ్ముడవగా.. మేలో ఈ సంఖ్య 5,500కు పెరిగింది. జూన్ నెలలో 5,400గా ఉండగా.. జూలైలో వర్షాకాలం ప్రారంభంతో సుమారు 4,850 బాటిళ్లకు తగ్గింది. వేసవి కాలం ముగియడంతో.. మరీ ముఖ్యంగా బీర్ విక్రయాల్లో ఈ తగ్గుదల స్పష్టంగా కనిపించింది. మరోవైపు.. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) డిపోల్లో ప్రతి నెలా సుమారు 35 వేల కేసుల మద్యం, బీర్ అమ్ముడుకాకుండా స్టాక్ నిల్వ ఉంటున్నట్లు మద్యం పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

# కులాన్ని చూసే ఉద్యోగం!

మొదటి పేజీ తరువాయి

అనేక స్కూళ్లు, కాలేజీలు ఉపాధ్యాయులు, పుస్తకాలు, విద్యుత్, నీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కూడా సరిగా లేవని ఆయన విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో ఇంటర్వ్యూలు కీలకంగా మారుతున్నాయని పేర్కొన్న రామ్‌దేవ్.. ఈ దశలో అవినీతికి అవకాశం ఉంటోందని ఆరోపించారు. కులం, సామాజిక వర్గం, మతం, భావజాలం ఆధారంగా కొంతమంది వ్యక్తులు.. అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల అర్హత ఉన్న అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకులు, పరీక్షల్లో అక్రమాలు వంటి అంశాలు కూడా యువతలో తీవ్ర ఆగ్రహాన్ని పెంచుతున్నాయని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు. ప్రజాగ్రహం మరింత పెరిగి పెద్దఎత్తున ఉద్యమాలకు దారితీయకముందే.. విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులను ప్రభుత్వం, అధికారులు సీరియస్‌గా తీసుకోవాలని రామ్‌దేవ్ హెచ్చరించారు.

# వందేమాతరం ఆలపించని కేరళ

మొదటి పేజీ తరువాయి

ఇటీవల జారీ చేసిన కొత్త ప్రోటోకాల్‌కు భిన్నంగా కేరళ ప్రభుత్వం అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించింది. శనివారం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వీడీ సతీశన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం జన గణ మన గీతాన్ని ఆలపించారు. అయితే, ఈ అధికారిక రాష్ట్ర వేడుకలో వందేమాతరం గేయాన్ని మాత్రం ఆలపించలేదు. దీంతో ఈ విషయం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అయితే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందే కేరళ ప్రభుత్వ వైఖరిపై ఆసక్తకర పరిణామాలు నెలకొన్నాయి.

# బీఆర్ఎస్‌లోకి జీవితంలో వెళ్లను

మొదటి పేజీ తరువాయి

కుటుంబంలో కానీ ఎవరితోనూ తనకు ఎలాంటి పంచాయతీలు లేవని, సస్పెన్షన్ కంటే ఒక ఏడాది ముందు నుంచే తనను పక్కన పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం షోకాజు నోటీసు కూడా ఇవ్వకుండా బయటికి పంపించారని, అయితే నైతికతకు కట్టుబడి తానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినట్లు స్పష్టం చేశారు. తాను ఎప్పుడూ తన తండ్రిని ఎదురించలేదని ఆమె గుర్తు చేసుకున్నారు. తన కొత్త పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని, రాబోయే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తామనే నమ్మకం తనకు ఉందని కవిత ధీమా వ్యక్తం చేశారు. "నేను గెలవకపోతే ఎవరు గెలుస్తారో తెలియదు. మాది ఆర్ట్ మూవీ కాదు, కమర్షియల్ మూవీ. మా విధానం నచ్చి అనేకమంది సహాయం చేస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. రాబోయే ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలకు తమ పార్టీ గట్టి పోటీ ఇస్తుందని, తమకు ఎంత ఓటుబ్యాంకు ఉందో ముందు ముందు తెలుస్తుందన్నారు. ఈ క్రమంలో పార్టీ ఆవిర్భావం సమయంలో తనను వైఎస్ షర్మిలతో పోల్చారని, ఆమెకు తనకు పోలిక ఏంటన్న ఆమె, కేసీఆర్ తరహాలోనే తాను కూడా ఒక కొత్త చరిత్రను సృష్టిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో భావజాలం, వ్యక్తిగత సంబంధాలు వేరని కవిత అభిప్రాయపడ్డారు. రాజకీయాలు వేరు, వ్యక్తిగత స్నేహాలు వేరని.. వ్యక్తిగతంగా కుటుంబంతో కలిసినప్పటికీ, రాజకీయంగా బీఆర్ఎస్‌తో కలిసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రాణం ఉన్నంతవరకూ బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయనని, అలాగని ఆ పార్టీని అధికారంలోకి రాకుండా చేయడమే తమ సిద్ధాంతం కాదని కూడా స్పష్టం చేశారు.

# అగ్గిపెట్టెలో పట్టే బొమ్మ



## అబ్బురపడ్డ పవన్ కల్యాణ్ భార్య

రాజమండ్రి, ఆగస్టు 15 (ఈవార్తలు): ఏపీవ్యాప్తంగా ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం ప్రారంభించారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని ధవళేశ్వరం వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకును పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అలాగే రాష్ట్రంలోని ఆరు ప్రధాన క్లస్టర్ల పరిధిలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులకు వర్చువల్‌గా ప్రారంభించారు. వీటి ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఐదు వేల హస్త కళాకారుల కుటుంబాలకు కలప కొరత సమస్య తీరనుంది. రాజమహేంద్రవరం సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులో ప్రస్తుతం 30 క్యూబిక్ మీటర్ల కలపను అందుబాటులో ఉంచారు. వచ్చే ఐదేళ్ల అవసరాలకు సరిపడా కలపను త్వరలో అందుబాటులో ఉంచుతామని అటవీ శాఖ అధికారులు చెప్తున్నారు. కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక, మాధవమాల, శెట్టిగుంట, బొబ్బిలి వీణల కళాకారుల కోసం ఆయాచోట్ల క్రాఫ్ట్ వుడ్ బ్యాంకులు ఏర్పాటు చేశారు. వీటిలోనూ కళాకారులకు కావాల్సిన కలపను అందుబాటులో ఉంచనున్నారు. మరోవైపు ధవళేశ్వరంలో సెంట్రల్ క్రాఫ్ట్‌వుడ్ బ్యాంక్‌ను ప్రారంభించిన అనంతరం.. సతీమణి అన్నా కొణిదెలతో కలిసి పవన్ కళ్యాణ్ దానిని పరిశీలించారు. వుడ్ బ్యాంకులోని కలప, కళాకారులు తయారు చేసిన కళాకృతులను తిలకించారు. ప్రతి బొమ్మపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, కళాకారుడి వివరాలు, తయారీ విధానాన్ని పవన్ పరిశీలించారు. ప్రతి స్టాల్ వద్ద కళాకారులతో మాట్లాడి.. బొమ్మల తయారీ విధానం, కళాకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వుడ్ బ్యాంకులోని కలప దుంగలపై ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఆ దుంగను ఎక్కడి నుంచి తెచ్చారు, ఆ చెట్టు వయస్సు, శాస్త్రీయ నామం వంటి వివరాలను తెలుసుకున్నారు. ఇక చేతివృత్తుల కళాకారులు రూపొందించిన కళాకృతులను పరిశీలించే సమయంలో.. అగ్గిపెట్టెలో ఇమిడేలా రూపొందించిన కళారూపం పవన్ కళ్యాణ్ దంపతులను విశేషంగా ఆకర్షించింది. ఈ నేపథ్యంలో సతీమణి అన్నాతో కలిసి పలు కళాకృతులను పవన్ కళ్యాణ్ కొనుగోలు చేశారు. తయారు చేసిన వారిని అభినందించారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

\- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## హైదరాబాద్‌లో 24 గంటలు నీళ్లు బంద్

### సింగూరు ప్రాజెక్ట్ పైప్‌లైన్ పనుల కారణంగా ఈ అంతరాయం

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): హైదరాబాద్ వాసులకు ముఖ్య గమనిక. నగరంలోని పలు ప్రాంతాల్లో 24 గంటల పాటు మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (జలమండలి) వెల్లడించింది. ఆగస్ట్ 17 (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి మరుసటి రోజు, ఆగస్ట్ 18వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటల వరకు ఈ నీటి కోత అమల్లో ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. సింగూరు ప్రాజెక్టుకు చెందిన 1600 ఎంఎం వ్యాసం కలిగిన పంపింగ్ మెయిన్ పైప్ లైన్‌కు అత్యవసర మరమ్మతులు చేపట్టనుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జలమండలి తెలిపింది. ఈ పనుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోనుండగా, మరికొన్ని చోట్ల పాక్షికంగా లేదా తక్కువ పీడనంతో నీరు సరఫరా అవుతుందని పేర్కొన్నారు.

**ప్రభావితమయ్యే ప్రాంతాలు ఇవే:** గాయత్రినగర్, బోరబండ, ఈఎస్ఐ ప్రాంతాల్లో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోనుంది. షేక్‌పేట్, కోకాపేట, మణికొండ, నార్సింగి ప్రాంతాల్లో పాక్షికంగా అంతరాయం ఏర్పడనుంది. బీహెచ్ఈఎల్, ఎంఐజీ-1, 2, రైల్ విహార్, చందానగర్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), కేపీహెచ్‌బీ కాలనీ పరిసరాల్లోని బల్క్ కనెక్షన్లకు కూడా నీటి సరఫరాలో ఆటంకం కలగనుంది. ఎస్ఆర్ నగర్, ఎర్రగడ్డ, అమీర్‌పేట, బంజారాహిల్స్, సోమాజిగూడ, కొండాపూర్, హఫీజ్‌పేట్, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్, మలేషియన్ టౌన్‌షిప్, హైదర్ నగర్, బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా వంటి అనేక ప్రాంతాల్లో తక్కువ పీడనంతో నీరు సరఫరా అవుతుందని జలమండలి వివరించింది.

## ఇందిరమ్మ టవర్స్ దరఖాస్తు గడువు ముగింపు

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఈ నియోజకవర్గాల నుంచి మొత్తం 60,014 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఈ నెల 20వ తేదీ తర్వాత లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పి.వి. గౌతం తెలిపారు. మరోవైపు, నగరంలోని మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం రేపటి నుంచి కొత్తగా దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎల్బీనగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల ప్రజలు సెప్టెంబర్ 3వ తేదీ వరకు 'మీ సేవ' కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఈ నియోజకవర్గాల లబ్ధిదారుల కోసం నిర్మించనున్న ఇళ్ల ప్రాంతాలను కూడా అధికారులు ఖరారు చేశారు. ఎల్బీనగర్ వాసులకు ఆమన్ గల్‌లో, గోషామహల్, ముషీరాబాద్ వాసులకు జమిస్తాన్‌పూర్‌లో, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని వారికి బండ్లగూడలో ఇళ్లను కేటాయించనున్నారు.

## నల్సార్ విద్యార్థులకు బీసీఐ చైర్మన్ క్షమాపణ

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా విద్యార్థులకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా క్షమాపణలు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన ఒక లేఖను విడుదల చేశారు. ఈ వివాదానికి సంబంధించి తాను రాసిన లేఖ లేదా చేసిన వ్యాఖ్యలు విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసి ఉంటే, అందుకు క్షమించాలని ఆయన కోరారు. "విచారం వ్యక్తం చేయడం అనేది ప్రతిష్ఠకో లేదా అహంకారానికి సంబంధించిన విషయం కాదు. మన విద్యార్థుల భావాలకు, వారి ఆందోళనలకు విలువ ఇవ్వడమే అత్యంత ముఖ్యం" అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. నల్సార్ 2026 గ్రాడ్యుయేట్ బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేయవద్దంటూ బీసీఐ ఇటీవల రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హాజరుకావడాన్ని సుమారు 450 మంది విద్యార్థులు వ్యతిరేకించడంతో బీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. నీట్-యూజీ పేపర్ లీక్ వ్యవహారంలో విద్యార్థుల నిరసనలకు సంబంధించిన పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్ స్పందించిన తీరును ఆక్షేపిస్తూ వారు ఈ నిరసన తెలిపారు. అయితే, బీసీఐ ఉత్తర్వులపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ఆ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఈ వివాదంపై జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు విద్యార్థులకు ఉంటుందని, ఈ విషయంలో బీసీఐ జోక్యం అనవసరమని ధర్మాసనం స్పష్టం చేసింది. తాజాగా బీసీఐ చైర్మన్ బహిరంగంగా క్షమాపణలు చెప్పడంతో ఈ వివాదం సద్దుమణిగింది.

## భోగాపురంలో సీఐఎస్ఎఫ్ బాధ్యతలు



భోగాపురం, ఆగస్టు 15 (ఈవార్తలు): ఏపీలోని భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం భద్రతా వ్యవస్థలో ఒక కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్ ) అధికారికంగా తమ భద్రతా బాధ్యతలను స్వీకరించింది. ఈ సందర్భంగా విమానాశ్రయ ప్రాంగణంలో సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు, సిబ్బందితో కలిసి సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ రంజన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఐఎస్ఎఫ్ డీజీ ప్రవీణ్ రంజన్ మాట్లాడుతూ, కేవలం 31 నెలల రికార్డు సమయంలో ఈ విమానాశ్రయ నిర్మాణం పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికులకు అత్యున్నత స్థాయి భద్రతతో పాటు స్నేహపూర్వకమైన సేవలు అందించేందుకు సీఐఎస్ఎఫ్ పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో మీడియా మిత్రుల నుంచి నిరంతర సహకారం, పూర్తి మద్దతును ఆశిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# వినతిపత్రం ఇస్తే సస్పెండ్ చేస్తారా?

### కూటమి సర్కారుపై వైసీపీ నేత భూమన ఫైర్





కడప, ఆగస్టు 15 (ఈవార్తలు): ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. టెట్ సమస్యపై ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి వినతిపత్రం ఇచ్చినందుకు టీచర్లను సస్పెండ్ చేస్తారా అంటూ తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను నమ్మించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మోసం చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల భవిష్యత్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఆటలు ఆడుతోందని విమర్శించారు. చంద్రబాబు వైఖరిపై ప్రభుత్వ ఉపాధ్యాయులు చేసే పోరాటానికి వైసీపీ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షను వైసీపీ వ్యతిరేకిస్తోందని భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు వైఎస్సార్ కడప జిల్లాలోని వేంపల్లి మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులను అధికారులు సస్పెండ్ చేశారు. ఏపీకి చెందిన ఓ బృందం ఇటీవల కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి వినతి పత్రం సమర్పించింది. ఈ బృందంలో వేంపల్లి మండలానికి చెందిన ఎస్జీటీలు వెంకటనాథరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, సంగమేశ్వరరెడ్డి ఉన్నారు. ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ కాగా.. సర్వీసు నిబంధనలను అతిక్రమించి వ్యవహరించారంటూ ఈ ముగ్గురినీ సస్పెండ్ చేశారు. కడప డీఈవో షంషుద్దీన్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈ వ్యవహారంలో రెండు రకాల వాదనలు వినిపిస్తున్నాయి. ఏపీ ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ.. వీరు కేంద్ర మంత్రికి ఫిర్యాదు చేశారంటూ ఓ వాదన వినిపిస్తోంది. అయితే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరేందుకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిశారనే వాదన కూడా ఉంది. అయితే ప్రభుత్వ సర్వీస్ నిబంధనలకు విరుద్ధంగా.. ముందస్తు అనుమతి తీసుకోకుండానే కేంద్ర మంత్రిని కలవడాన్ని విద్యాశాఖ అధికారులు చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే వీరు ముగ్గురిని సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారం ఏపీలో హాట్ టాపిక్‌గా మారగా.. ఈ వ్యవహారంపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# ఉరికించి కొడతాం

### బీజేపీ ఎంపీ అర్వింద్‌కు కాంగ్రెస్ హెచ్చరిక

### మహేశ్ గౌడ్‌పై వ్యాఖ్యల ఖండన



హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌పై అరవింద్ చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. తన వైఖరి మార్చుకోకపోతే ఇంటికి వచ్చి ఉరికించి కొడతామని ఘాటుగా హెచ్చరించారు. శనివారం గాంధీ భవన్‌లో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, కార్పొరేషన్ల ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, మెట్టు సాయికుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ, అరవింద్ తన నోటి దురుసును అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. ఎన్ఎస్‌యూఐ స్థాయి నుంచి కష్టపడి పైకొచ్చిన బీసీ బిడ్డ మహేశ్ కుమార్ గౌడ్‌ను విమర్శించే స్థాయి అరవింద్‌కు లేదని మండిపడ్డారు. తండ్రి పేరును వాడుకుని రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్, స్వయంకృషితో ఎదిగిన నాయకులను విమర్శించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు ఎక్కడ తెచ్చారో, గల్ఫ్ బాధితుల సంక్షేమం కోసం ఏం చేశారో అరవింద్ స్పష్టం చేయాలని అనిల్ డిమాండ్ చేశారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుంటే, అరవింద్ కేవలం విమర్శలు చేయడానికే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. డీఎస్ కుటుంబానికి వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. సాయికుమార్ మాట్లాడుతూ, అరవింద్ మాటలు మద్యం దుకాణాల వద్ద తాగుబోతుల మాట్లాడే తీరులో ఉన్నాయని విమర్శించారు. దమ్ముంటే ఎంపీ పదవికి రాజీనామా చేసి కౌన్సిలర్‌గా గెలిచి చూపాలని సవాల్ విసిరారు. "ఇంకోసారి హద్దు మీరితే ఇంటికి వచ్చి మరీ గుణపాఠం చెబుతాం" అని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తన పార్టీ నాయకులను అదుపులో ఉంచుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని స్పష్టం చేశారు.



## నల్గొండ నా ఊపిరి: కోమటిరెడ్డి

నల్గొండ, ఆగస్టు 15 (ఈవార్తలు): నల్గొండ జిల్లాను అభివృద్ధి పథంలో పయనింపజేసి, తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శంగా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్గొండ పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నల్గొండ నేల చూపిన త్యాగం, ఆత్మగౌరవం స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీకలని అభివర్ణించారు. తన శ్వాస ఉన్నంత వరకు జిల్లా ప్రజల ఆశలు, ఆకాంక్షల కోసమే పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా తీర్చే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 5.35 లక్షల మంది రైతులకు రూ. 715 కోట్ల రైతు భరోసా, 1.99 లక్షల మంది పింఛనుదారులకు రూ. 51.28 కోట్లు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే 17,873 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి 4,360 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేశామని, 2.56 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. నల్గొండ పట్టణంలో 24 గంటల మంచినీటి సరఫరా లక్ష్యంతో రూ. 83 కోట్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడమే కాకుండా, పట్టణాభివృద్ధి కోసం మరో రూ. 300 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు రూ. 20 కోట్లతో ఎన్‌పీసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అమరవీరుల త్యాగాల సాక్షిగా నల్గొండ జిల్లాను అన్ని రంగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలబెడతానని హామీ ఇచ్చారు.



## గర్భగుడిలో మైనర్‌పై అఘాయిత్యం

### పూజారిని పట్టుకున్న స్థానికులు

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): పవిత్రమైన ఆలయ గర్భగుడిలోనే ఓ మైనర్ బాలికపై వృద్ధ పూజారి లైంగిక దాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. బాలికతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న పూజారిని స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామచంద్రాపురంలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. రామచంద్రాపురంలోని ఓ ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న సాయన్న అనే వృద్ధుడు, ఓ మైనర్ బాలికతో గర్భగుడిలో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. ఆ సమయంలో ఆలయానికి బయట నుంచి తాళం వేసి ఉండటంతో వారికి అనుమానం బలపడింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు, గ్రామ పెద్దలు కలిసి ఆలయ తలుపులు తెరిచి చూడగా, బాలికతో పూజారి అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కనిపించాడు. ఆగ్రహానికి గురైన వారు అతడిని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రామచంద్రాపురం పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలికను రక్షించి, నిందితుడు సాయన్నను అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలు మైనర్ కావడంతో ఆమె వివరాలను గోప్యంగా ఉంచి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆలయం వంటి పవిత్ర ప్రదేశంలో ఇలాంటి ఘటన జరగడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఈ ఆలయ ప్రాంగణంలో కొన్ని అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వారు పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

## రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ

### అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తాం

### ఇప్పటికే 16 లక్షల కొత్త కార్డులు జారీ చేశాం

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

సంగారెడ్డి, ఆగస్టు 15 (ఈవార్తలు): రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందని, ఇది ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గతంలో ప్రజలకు నాణ్యత లేని దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసేవారని, అయితే తమ ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి సన్న బియ్యాన్ని సేకరిస్తోందని తెలిపారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఆహార భద్రతకే కాకుండా, అది ఒక కుటుంబానికి ప్రభుత్వం కల్పించే గౌరవం, గుర్తింపు అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని ఎన్నో సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి 3,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించి, త్వరలోనే వారికి కూడా కార్డులు జారీ చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## ఆనం రామనారాయణ రెడ్డికి అస్వస్థత

తిరుపతి, ఆగస్టు 15 (ఈవార్తలు): ఏపీలోని తిరుపతిలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రసంగిస్తుండగా ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. తిరుపతి పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి సుదీర్ఘంగా ప్రసంగిస్తున్న సమయంలో ఆయన స్పృహ తప్పారు. ఈ క్రమంలో ఆయన పక్కకు వాలిపోతుండగా, వేదికపై ఉన్న భద్రతా సిబ్బంది, అధికారులు వెంటనే అప్రమత్తమై ఆయనను కింద పడకుండా పట్టుకున్నారు. ఘటనా స్థలంలో ఉన్న వైద్య బృందం వెంటనే ప్రాథమిక చికిత్స అందించి, రక్తపోటు (బీపీ) తగ్గడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని వెల్లడించారు. సకాలంలో వైద్య సేవలు అందించడంతో ఆయన కోలుకున్నారు. కాసేపటి విశ్రాంతి తర్వాత మంత్రి ఆనం తిరిగి వేడుకలలో పాల్గొనగా, ఆయన మిగిలిన ప్రసంగాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చదివి వినిపించారు.

## 22ఏ పేరుతో భారీ దోపిడీ: సంజయ్

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): తెలంగాణలో నిషేధిత భూముల జాబితా (22ఏ) ముసుగులో భారీ దోపిడీ సాగుతోందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనల మధ్య ఎలాంటి తేడా లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న 2.77 కోట్ల ఎకరాల్లో ఏకంగా 95 లక్షల ఎకరాలను 22ఏ నిషేధిత జాబితాలో ఎలా చేరుస్తారని బండి సంజయ్ నిలదీశారు. ప్రజలు కష్టపడి కొనుక్కున్న స్థలాలు, కూడా ఈ జాబితాలో చేర్చి వేధిస్తున్నారని విమర్శించారు. విద్యాసంస్థల ఫీజు రీయింబర్స్ మెంట్ పాత బకాయిలను ఇంకా చెల్లించకుండా, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్వాన్స్ ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. కల్పిస్తామనే కాంగ్రెస్ మాటలు నిజమైతే... వెంటనే యువకులకు మంత్రి పదవులు, ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని సవాల్ విసిరారు.

# 10 మంది జగిత్యాల జిల్లా పోలీసులకు పతకాలు

జగిత్యాల, ఆగస్టు 15 (ఈవార్తలు): విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్ఠాత్మక సేవ, ఉత్తమ సేవ పోలీసు పతకాలకు ఎంపికైన 10 మంది అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ అభినందించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో వారిని సన్మానించి పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేసే సిబ్బందికి గుర్తింపు లభించడం జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. పతకాలు మరింత బాధ్యతతో పనిచేసేందుకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకునేలా సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీలు పురుషోత్తంరెడ్డి, రవికుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీఖాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఐఎం కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ

జగిత్యాల, ఆగస్టు 15 (ఈవార్తలు): 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఐఎం జగిత్యాల పట్టణ అధ్యక్షుడు మహ్మద్ సమీర్‌ఉద్దీన్ ఆజాద్, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, దేశ అభివృద్ధి, ఐక్యత, సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమంది చేసిన త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సోదరభావం, శాంతి, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బిస్మిల్లా ఖాన్, ఎంఐఎం 34 వార్డ్ కౌన్సిలర్ డాక్టర్ మహ్మద్ అయూబ్ ఖాన్, యాసర్, ఫయాజ్ అలీ, ఫిరోజ్ ఖాన్‌తో మున్నాభాయ్ పాటు ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా మేరు సంఘం స్వాతంత్ర్య వేడుకలు

జగిత్యాల, ఆగస్టు 15 (ఈవార్తలు): 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరు సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం పట్టణ అధ్యక్షుడు రాపర్తి వినోద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. సంఘం ప్రధాన కార్యదర్శి గట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు స్వేచ్ఛగా జీవిస్తున్నామని అన్నారు. వారి ఆశయాలను నేటి తరం కొనసాగించాలని, యువత దేశభక్తి, క్రమశిక్షణతో దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాగిళ్ల నారాయణ, కోశాధికారి గట్ల శ్రీకర్, గట్ల రమేష్, రాగిళ్ల సత్యనారాయణ, కులబాంధవులు, మేరు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకే ఈ-చలాన్ ఫైల్‌తో రూ.4.15 లక్షలు మాయం

జగిత్యాల, ఆగస్టు 15 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో (ఏపీకి) ఈ చలాన్ ఫైల్ ద్వారా సైబర్ మోసం జరిగిన ఘటన కలకలం రేపింది. వాణీనగర్‌కు చెందిన ఎలిగేటి అశోక్ వాట్సాప్‌కు వచ్చిన ఓ (ఏపీకి) ఈ చలాన్ ఫైల్‌ను ఓపెన్ చేయడంతో ఆయన బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా మొత్తం రూ.4.15 లక్షలు మాయమైనట్లు తెలిపారు. ఫైల్‌ను ఓపెన్ చేసి వదిలేసిన కొద్దిసేపటికే ఖాతా నుంచి నగదు డ్రా అయినట్లు వరుసగా మెసేజ్‌లు రావడంతో అశోక్ అప్రమత్తమయ్యారు. వెంటనే గాయత్రి బ్యాంకును సంప్రదించి ఫిర్యాదు చేసినప్పటికీ సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించలేదని బాధితుడు ఆరోపించారు. మరుసటి రోజు తన స్నేహితుడైన పోలీసు కానిస్టేబుల్‌ను సంప్రదించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే (ఏపీకి) ఈ చలాన్ ఫైళ్లు, లింకులు, యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని, అనుమానాస్పద సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.




# జీఎంఎస్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

జగిత్యాల, ఆగస్టు 15 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అరుంధతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ గీతాన్ని ఆలపిస్తూ జెండాకు వందనం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ దుస్తుల్లో ఉపాధ్యాయులు, వివిధ నృత్య ప్రదర్శనలకు అనుగుణంగా అలంకరించిన చిన్నారులు వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుంధతి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు స్వేచ్ఛగా జీవిస్తున్నామని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి ప్రసంగాలు, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

# రాజన్న గుడి అభివృద్ధికి 390 కోట్లు

వేములవాడ అర్బన్, ఆగస్టు 15 (ఈవార్తలు): దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి ఇప్పటివరకు రూ.390 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. మూలవాగు బ్రిడ్జి నుంచి రాజన్న ఆలయం వరకు రూ.47.86 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆలయ విస్తరణ, అభివృద్ధి, నిత్యాన్నదాన సత్రం నిర్మాణ పనులను రూ.111.25 కోట్లతో చేపట్టారు. అదనంగా ప్రభుత్వం రూ.99.40 కోట్లు మంజూరు చేసింది. రూ.12 కోట్లతో చేపట్టిన గుడి చెరువు బండ్ పార్కును ఇటీవల ప్రారంభించారు. అక్కడ 40 అడుగుల ఆది శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. బద్ది పోచమ్మ ఆలయ విస్తరణ పనులు తుది దశలో ఉన్నాయి. గుడి చెరువులో బోటింగ్ కోసం రూ.1.40 కోట్లు మంజూరు కాగా, టెండర్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. నాంపెల్లి గుట్టపై భారత వైమానిక దళం సహకారంతో విమాన నమూనా ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. రాజన్న ఆలయ గోశాల నిర్మాణానికి వేములవాడ రూరల్ మండలం మర్రిపెల్లిలో 40 ఎకరాల భూమిని కేటాయించారు. భీమేశ్వర స్వామి ఆలయంలో రూ.6 కోట్లతో భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు చేపట్టారు.

# దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## జగిత్యాలలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి

జగిత్యాల, ఆగస్టు 15 (ఈవార్తలు): భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల నియోజకవర్గ బీజేపీ కార్యాలయం 'కమల నిలయం'లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. బోగ శ్రావణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సమైక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యత స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, కౌన్సిలర్లు సిరిపురం శ్రీలత శ్రీనివాస్, గట్టిపెల్లి మానస-జ్ఞానేశ్వర్, నిమ్మల నాగరాజు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు నారపాక అశోక్‌తో పాటు జిల్లా, మండల, పట్టణ పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అటు.. పట్టణంలోని 40వ వార్డులో స్నేహమిత్ర యూత్, జగిత్యాల జిల్లా మేరు సంఘం, భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల లక్ష్మణ్ జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, దేశభక్తి స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించడంతో పాటు సమాజ సేవలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో స్నేహమిత్ర యూత్, భగత్‌సింగ్ యూత్ సభ్యులు, మేరు సంఘం ప్రతినిధులు, యువత, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 4న జగిత్యాల ముస్లిం కమిటీ అధ్యక్ష ఎన్నికలు



జగిత్యాల టౌన్, ఆగస్టు 15 (ఈవార్తలు): జగిత్యాల ముస్లిం సెంట్రల్ ఎన్నికల కమిటీ సమావేశం ఎన్నికల కమిషనర్ మొహమ్మద్ ఇమ్రాన్ అధ్యక్షతన శనివారం ముస్లిం కమ్యూనిటీ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ నూతన అధ్యక్షుని ఎన్నికకు సంబంధించి ఎన్నిక నిర్వహణపై ఎన్నికల కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ మొహమ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ జగిత్యాల ముస్లిం సెంట్రల్ ఎన్నికల కమిటీ సమావేశాన్ని నిర్వహించామని, జగిత్యాల ముస్లిం సెంట్రల్ కమిటీ నూతన అధ్యక్షుని ఎన్నికకు సంబంధించి ఎన్నిక నిర్వహణకు కమిటీ సభ్యుల అభిప్రాయాలు తెలుసుకొని, ఎన్నిక నిర్వహణకు చర్యలు చేపడుతున్నామని, సెప్టెంబర్ 4న ఎన్నికలు నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించిందన్నారు. అనంతరం ఎన్నికల కమిటీ సభ్యులతో కలిసి జగిత్యాల సెంట్రల్ ముస్లిం కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సమావేశంలో జగిత్యాల ముస్లిం సెంట్రల్ ఎన్నికల కమిటీ సభ్యులు ఆదిల్ పటేల్, తస్లిమ్ పాషా, అబ్దుల్లా, మాక్బుల్, సయ్యద్ అజీమ్, ముజహిద్ పాట్వారి, నేహాల్, అఖీల్ ఉద్దీన్ జావీద్, షాజీ ఫెరోజ్, షహేరజ్ ఉద్దీన్ మోసిక్, ఫజల్ బేగ్, నహిద్, షహేబాజ్, ఆరిఫ్, రూమన్, కలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఒకేసారి 80 జాతీయ జెండాల ఆవిష్కరణ

వేములవాడ అర్బన్, ఆగస్టు 15 (ఈవార్తలు): పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో ఒకేసారి 80 జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జాతీయ భావాన్ని పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని నాయకులు తెలిపారు. దేశ రక్షణ, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు, వైద్యులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అటు.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తొలిసారిగా మున్సిపల్ భవనంపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ వంటి మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంతో పాటు పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, సింగిల్ విండో సొసైటీ, మున్నూరు కాపు సంఘం భవనాల్లో జరిగిన వేడుకల్లోనూ ఆయన పాల్గొన్నారు.

# పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వేడుకలు

వేములవాడ అర్బన్, ఆగస్టు 15 (ఈవార్తలు): వేములవాడ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రాంపల్లి వెంకటరమణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు నడిగట్ల భిక్షపతి, వాస భూమేష్, కోశాధికారి రాపల్లి శ్రీధర్, కార్యదర్శి వాసం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ మనోజ్ రెడ్డికి ఉత్తమ అవార్డు

ముషీరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్ జిల్లా పరిధిలో ఉత్తమ వైద్యాధికారిగా డా. ఎం. మనోజ్ రెడ్డి కలెక్టర్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డా. ప్రియాంక ఆల చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని స్వీకరించారు. ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డా. మనోజ్ రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు విధి నిర్వహణలో అంకితభావం చూపుతున్నందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఇప్పటివరకు ఆయన ఏడు అవార్డులు అందుకోగా, వాటిలో మూడు కలెక్టర్ అవార్డులు ఉండటం విశేషం. వరుసగా లభిస్తున్న పురస్కారాలు తన సేవలకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయని ఆయన తెలిపారు.






# 'సలాం సైనికా'కు ఘన గౌరవం

హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని వార్ మెమోరియల్ వద్ద అక్షరయాన్ ఆధ్వర్యంలో 'సలాం సైనికా' త్రిభాషా కవితా సంపుటిని ఆవిష్కరించారు. సైనిక ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేజర్ జనరల్ జి. శ్రీనివాస్, లెఫ్టినెంట్ జనరల్ సురేంద్రనాథ్ (రిటైర్డ్), బ్రిగేడియర్ రాజీవ్, కల్నల్ సురేష్, కల్నల్ ముకుల్ పాయల్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 1,580 మంది తెలుగు రచయిత్రులను కలుపుకున్న అక్షరయాన్ మహిళా రచయిత్రుల సృజనాత్మకతకు వేదికగా నిలుస్తోందని నిర్వాహకులు తెలిపారు. 2018లో అయినంపూడి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ సంస్థ మహిళా రచయిత్రుల ప్రతిభకు గుర్తింపు కల్పించడంతో పాటు కొత్త అవకాశాలను సృష్టిస్తోందన్నారు. పరమవీరచక్ర పురస్కారం పొందిన 21 మంది వీర సైనికులపై అక్షరయాన్ కవయిత్రులు రచించిన కవితలను తొలుత తెలుగులో 'సలాం సైనికా' పేరుతో ప్రచురించారు. అనంతరం హిందీ, ఇంగ్లిష్ భాషల్లోకి అనువదించి త్రిభాషా సంపుటిగా రూపొందించారు. సైనికుల త్యాగం, ధైర్యం, దేశభక్తిని సాహిత్యం ద్వారా ప్రజలకు చేరువ చేయడం ఈ సంకలనం ప్రధాన ఉద్దేశమని రచయిత్రి రమాదేవి కులకర్ణి తెలిపారు.



# మహేశ్వరికి ఉత్తమ నర్సింగ్ ఆఫీసర్ అవార్డు

రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 15 (ఈవార్తలు): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బోయినపల్లి పీహెచ్‌సీ నర్సింగ్ ఆఫీసర్ ఎస్. మహేశ్వరికి ఉత్తమ నర్సింగ్ ఆఫీసర్‌గా ప్రశంసాపత్రం లభించింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే చేతుల మీదుగా ఆమె ఈ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. విధుల్లో ప్రతిభ కనబరిచినందుకు ఈ గుర్తింపు లభించింది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి. ఏంజెలా ఆల్ఫ్రెడ్ మహేశ్వరిని అభినందించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు భవిష్యత్తులోనూ కృషి చేస్తానని మహేశ్వరి తెలిపారు.

# కాన్వెంట్ స్కూల్‌లో దేశభక్తి సందడి

వేములవాడ అర్బన్, ఆగస్టు 15 (ఈవార్తలు): వేములవాడలోని కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ధరక్షన్ వసూపియా జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తూ 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై' నినాదాలు చేశారు. దేశభక్తి గీతాలు, నృత్యాలతో అలరించారు. స్కూల్ కరస్పాండెంట్ నరాల దేవేందర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# ప్రతి వర్గానికి కాంగ్రెస్ మోసం: జీవన్ రెడ్డి

జగిత్యాల, ఆగస్టు 15 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని, ఆయన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతి వర్గం మోసపోతోందని విమర్శించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, జెడ్పీ తొలి మాజీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్, మాజీ డీసీఎంఎస్ అధ్యక్షుడు ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, హక్కుల కోసం కేసీఆర్ సారథ్యంలో పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించామని తెలిపారు. కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతుల్లో ఆత్మవిశ్వాసం నింపారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టకుండా సీఎం రేవంత్‌రెడ్డి రైతులపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమాను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కల్యాణలక్ష్మి నిలిపివేతపై ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయకపోవడం పేదల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఎన్నికల సమయంలో ఆడబిడ్డలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలను ఆశల పల్లకిలో ఊరేగించారని విమర్శించారు. కొత్తగా ప్రారంభించే పింఛన్లలో వృద్ధులు, బీడీ కార్మికులకు అవకాశం లేకపోవడం బాధాకరమన్నారు. సమగ్ర కుటుంబ సర్వేతో పోలిస్తే ప్రస్తుత సర్వేలో బీసీ జనాభాను ఐదు శాతం తగ్గించి చూపారని ఆరోపించారు. జగిత్యాల జిల్లాలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తారని జీవన్‌రెడ్డి తెలిపారు.

# ఫతేనగర్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

కూకట్‌పల్లి, ఆగస్టు 15 (ఈవార్తలు): ఫతేనగర్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు కాంచి మహేందర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని, దేశ ఐక్యత, అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి పౌరుడు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం యువతతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో బైక్‌లపై యువత పాల్గొని 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం', 'జైహింద్' నినాదాలతో ఫతేనగర్ వీధుల్లో ఉత్సాహాన్ని నింపారు.

# మల్యాలలో ఘనంగా పంద్రాగస్టు సంబురాలు

మల్యాల, ఆగస్టు 15 (ఈవార్తలు): 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్యాల మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. మల్యాల గ్రామపంచాయతీలో సర్పంచ్ బోట్ల జయ, మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి రఘువరన్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సందీప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాగలక్ష్మి, వ్యవసాయ కార్యాలయంలో ఏఓ చంద్రదీపక్, విద్యా కేంద్రంలో ఎంఈఓ జయసింహారావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జాతీయ గీతాలాపన అనంతరం దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

వేములవాడ అర్బన్, ఆగస్టు 15 (ఈవార్తలు): సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాభాష్‌పల్లిలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. నోట్‌బుక్స్, పలకలు, పెన్సిళ్లు, పెన్నులను అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు దోహదపడతాయని స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏ.టి. యాదవ్, ఉపసర్పంచ్ పండుగ శ్రీనివాస్, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయుడు సునీల్, ఉపాధ్యాయురాలు రమాదేవి, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏద్దండి రాజు, నిర్వాహకులు పిల్లి బాబురావు, కోశాధికారి దూలం భూమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రకోట ప్రసంగాల్లో మోదీ రికార్డ్

న్యూఢిల్లీ: భారత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన నలుగురు ప్రధానమంత్రుల్లో, ఎర్రకోట నుంచి అత్యధిక సమయం ప్రసంగించిన నేతగా ఆయన నిలిచారు. ప్రసంగాల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం ప్రసంగ సమయం పరంగా మాజీ ప్రధానులందరి కంటే ఆయన ముందంజలో ఉండటం విశేషం. ప్రధాని మోదీ ఇప్పటివరకు 13 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ద్వారా మొత్తం 1,177 నిమిషాలు పాటు ప్రసంగించారు. ఇదే క్రమంలో, 16 ప్రసంగాల్లో ఇందిరా గాంధీ 504 నిమిషాలు, 10 ప్రసంగాల్లో మన్మోహన్ సింగ్ 417 నిమిషాలు, 17 ప్రసంగాల్లో జవహర్‌లాల్ నెహ్రూ 400 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు.

## అరుణాచల్ ప్రదేశ్‌లో ఐదుగురు సైనికులు గల్లంతు

ఇటానగర్: అరుణాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలు పెను విషాదాన్ని మిగిల్చాయి. శుక్రవారం సాయంత్రం వేర్వేరు జిల్లాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో ఐదుగురు ఆర్మీ సిబ్బంది గల్లంతవగా, నలుగురు కూలీలు ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు సంభవించడమే ఈ దుర్ఘటనలకు ప్రధాన కారణం. దిబాంగ్ వ్యాలీ జిల్లాలోని పసు పానీ ఆర్మీ క్యాంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షం కారణంగా వచ్చిన ఆకస్మిక వరద, 5వ గ్రెనేడియర్‌కు చెందిన రెండు షెల్టర్లను ముంచెత్తింది. ఈ వరద ఉధృతిలో ఏడుగురు సైనికులు కొట్టుకుపోగా, వారిలో ఇద్దరిని సిబ్బంది సురక్షితంగా రక్షించారు. గల్లంతైన మరో ఐదుగురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## భారత్‌కు ప్రత్యేక గౌరవం: పుతిన్

మాస్కో: భారత్ సాధిస్తున్న ప్రగతిని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసించారు. ఆర్థిక, సామాజిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ అద్భుతమైన విజయాలు సాధిస్తోందని అన్నారు. ప్రపంచ వేదికపై భారత్ తనకంటూ ప్రత్యేక గౌరవాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీకి పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. భారత్, రష్యా మధ్య సంబంధాలు ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో ముందుకు సాగుతున్నాయని పుతిన్ చెప్పారు. ఐక్యరాజ్యసమితి, ఎస్‌సీఓ, బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రత, స్థిరత్వానికి కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని అన్నారు. భారత్ అభివృద్ధి ప్రయాణానికి రష్యా అండగా ఉంటుందని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ ముందుకు సాగుతున్న తీరును చూస్తే ప్రజల కలలన్నీ నెరవేరుతాయనే నమ్మకం ఉందన్నారు. రష్యా మద్దతు భవిష్యత్తులోనూ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## నేడు తెరుచుకోనున్న శబరిమల ద్వారాలు

శబరిమల: కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శబరిమల అయ్యప్ప స్వామి ఆలయ ద్వారాలు మలయాళ నూతన సంవత్సరం, పవిత్ర 'చింగం' మాస పూజల నిమిత్తం రేపు సాయంత్రం 5 గంటలకు తెరుచుకోనున్నాయి. ఆలయ ముఖ్య తంత్రి కందరారు బ్రహ్మదత్తన్ సమక్షంలో ప్రధాన పూజారి (మేల్‌శాంతి) ప్రసాద్ ఈడీ గర్భగుడి తలుపులను తెరిచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. మలయాళ నూతన సంవత్సర ప్రారంభ దినమైన ఆగస్టు 17న ఉదయం 5 గంటల నుంచి భక్తులకు స్వామివారి దివ్య దర్శనం కల్పిస్తారు. ఈ ప్రత్యేక పూజలు ముగిసిన అనంతరం ఆగస్టు 21న రాత్రి 10 గంటలకు ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తారు. అనంతరం ఓనం పండుగ ఉత్సవాల సందర్భంగా ఆగస్టు 24న ఆలయాన్ని తిరిగి పునఃప్రారంభిస్తారని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు వెల్లడించింది. యాత్రకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు, కేరళ ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు చేశాయి. పంబ బేస్ క్యాంప్‌కు చేరుకోవడానికి నిలక్కల్ నుంచి 24 గంటల పాటు ఆర్టీసీ షటిల్ బస్సు సేవలను అందుబాటులో ఉంచారు. భక్తులు ముందస్తుగా 'శబరిమల ఆన్ లైన్ పోర్టల్' ద్వారా వర్చువల్ క్యూ స్లాట్లను బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.





# వందేమాతరం ఆపాలన్నారా?

**సోనియా, ఖర్గే సైగలపై దుమారం**

న్యూఢిల్లీ: కాంగ్రెస్ ఆఫీసులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వందేమాతరం చుట్టూ కొత్త వివాదం మొదలైంది. పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే చేసిన సైగలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో ఇద్దరూ చేతులతో కొన్ని సంకేతాలు చేశారు. సోనియా అక్కడి నిర్వాహకులపై ఏదో విషయంలో అసహనం వ్యక్తం చేసినట్లుగా వీడియోలో కనిపించింది. గేయాన్ని ఆపాలని సూచించినట్లుగా ఆ సైగలు కనిపించాయని అధికార పక్షం ఆరోపిస్తోంది. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఖర్గే సహా పలువురు నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో సోనియా, ఖర్గే పక్కనున్న వారివైపు చేతులతో సంకేతాలు చేశారు. దీంతో కాంగ్రెస్ నేతలు గేయాన్ని ఆపాలని చెప్పారా? అనే ప్రశ్నలు తలెత్తాయి. కాంగ్రెస్ నాయకత్వం జాతీయ గీతాన్ని గౌరవించడం లేదంటూ బీజేపీ సహా పలువురు విమర్శలు చేశారు. ఈ వివాదంపై కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్‌ను మీడియా ప్రశ్నించింది. ఇందులో ఎలాంటి వివాదం లేదని ఆయన చెప్పారు. కాంగ్రెస్ వైఖరిని పార్టీ అధిష్ఠానం లేదా జైరాం రమేశ్ వివరిస్తారని తెలిపారు. అయితే వీడియోలో కనిపించిన సైగలపై కాంగ్రెస్ నుంచి ఇప్పటివరకు పూర్తి వివరణ రాలేదు.



## ట్వీట్లతో హర్మూజ్ మీ సొంతం కాదు

**ట్రంప్‌కు ఇరాన్ స్ట్రాంగ్ వార్నింగ్**

టెహ్రాన్: హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ అమెరికాదేనని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. హర్మూజ్ జలసంధి ఎప్పటికీ తమ నియంత్రణలోనే ఉంటుందని, దానిని ఎవరూ ఆక్రమించుకోలేరని పేర్కొన్నది. హర్మూజ్‌ను మూసి ఉంచాలా..? తెరవాలా..? అనేది తమ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ స్పష్టంచేశారు. యుద్ధ నౌకల మోహరింపు ద్వారా జలసంధిని స్వాధీనం చేసుకోలేరని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. అగ్రరాజ్యం తన భ్రమలను విడిచిపెట్టి.. ఓటమిని అంగీకరించే వరకు హర్మూజ్‌పై ఇరాన్ దిగ్బంధనాన్ని అమలు చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. తాము బెదిరింపులకు భయపడబోమని సైనిక ప్రదర్శనలకు లొంగబోమని స్పష్టంచేశారు. హర్మూజ్ ద్వారా నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నాయని అమెరికా చెబుతున్న మాటల్లో నిజం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందన్నారు. తమ సాయుధ దళాల అనుమతి లేకుండా ఏ వాణిజ్య నౌక కూడా ఈ మార్గంలో ప్రయాణించబోదని స్పష్టంచేశారు. హర్మూజ్ విషయంలో అమెరికా తప్పుడు అంచనాలు వేస్తోందన్నారు. యుద్ధంలో ఇరాన్‌ను ఓడిస్తామని, ఆ దేశం ఓటమిని చవిచూసిన అనంతరం హర్మూజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని శనివారం జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు.

## బెటర్.కామ్ సీఈవోకు ఉద్వాసన

న్యూఢిల్లీ: ఒకే జూమ్ కాల్‌లో 900 మందికి పైగా ఉద్యోగులను తొలగించి 2021లో ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భారత సంతతి వ్యాపారవేత్త విశాల్ గార్గ్, ఇప్పుడు తన సొంత కంపెనీ నుంచే ఉద్వాసనకు గురయ్యారు. తనను మోసపూరితంగా తొలగించారని ఆరోపిస్తూ, 'బెటర్ హోమ్ అండ్ ఫైనాన్స్' కంపెనీ సీఈవో పదవిని తిరిగి దక్కించుకోవడానికి ఆయన న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. వివరాల్లోకి వెళితే, ఆగస్టు 3న బెటర్.కామ్ బోర్డు విశాల్ గార్గ్‌ను సీఈఓ పదవి నుంచి తప్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో, కేవలం వారం రోజుల క్రితం (జులై 27న) బోర్డులో చేరిన హెడ్జ్ ఫండ్ మేనేజర్ డేనియల్ లూయిస్‌ను తాత్కాలిక సీఈఓగా నియమించింది. మొదట ఈ మార్పు ఇరువర్గాల గార్గ్ నిర్ణయాలు తీసుకునే తీరు, ఆయన ప్రవర్తన, విశ్వసనీయతపై ఉన్న ఆందోళనల కారణంగానే ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు స్పష్టం చేసింది.

## 'విశ్వగురు'కు వ్యతిరేకంగా కొన్ని శక్తులు: మోహన్ భగవత్

నాగ్‌పూర్: భారత్‌ను సంతోషకరమైన, సంపన్నమైన, సురక్షితమైన దేశంగా తీర్చిదిద్ది విశ్వగురుగా నిలపాలని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యాన్ని సాధించడం ఎంత ముఖ్యమో.. దాన్ని కాపాడుకోవడం కూడా అంతే ప్రధానమని అన్నారు. స్వాతంత్ర్యం కోసం 1857 నుంచి దాదాపు 90 ఏళ్ల పాటు ఎందరో త్యాగాలు చేశారని గుర్తుచేశారు. వారి పోరాట ఫలితంగా దేశానికి స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం ప్రతి భారతీయుడికి గర్వకారణమని చెప్పారు. నాగ్‌పూర్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయంలో శనివారం జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం భగవత్ మాట్లాడారు. భారత్ ప్రపంచానికి తన వంతు సహకారం అందించే స్థాయికి ఎదగాలని అన్నారు. అయితే ఈ లక్ష్యానికి వ్యతిరేకంగా అనేక మంది, శక్తులు పనిచేస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా దేశ సిద్ధాంతాలను వదులుకోకుండా వాటిని ఎదుర్కోవాలని సూచించారు. భారత్‌ను విశ్వగురుగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## బ్రిటన్ అంటే.. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ బ్రిటన్': నెతన్యాహు

గాజా: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మరోసారి తన వ్యాఖ్యలతో అంతర్జాతీయంగా వివాదాన్ని రాజేశారు. బ్రిటన్‌ను "ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ బ్రిటన్" అని అభివర్ణించిన ఆయన, అణ్వాయుధాలు కలిగిన తొలి ఇస్లామిక్ దేశంగా యూకే మారబోతోందంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై బ్రిటన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు రాజుకున్నాయి. ఇజ్రాయెల్ ఆర్మీ రేడియోకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో నెతన్యాహు ఈ వ్యాఖ్యలు చేశారు. 1967 యుద్ధ సమయంలో బ్రిటన్ మీడియా నుంచి ఇజ్రాయెల్‌కు లభించిన మద్దతును గుర్తుచేస్తూ, ప్రస్తుత పరిస్థితుల్లో బ్రిటన్‌లో ఆ మద్దతును ఆశించలేమని అన్నారు. ఈ క్రమంలోనే ఆయన బ్రిటన్‌ను 'ఇస్లామిక్ రిపబ్లిక్'గా పోల్చారు. "యూరప్ అంతా ఇలాగే ఉంది కదా?" అని ఇంటర్వ్యూయర్ ప్రశ్నించగా, నెతన్యాహు స్పందిస్తూ, "అవును, కానీ ఎవరో అన్నట్లుగా అణ్వాయుధాలు కలిగిన తొలి ఇస్లామిక్ రిపబ్లిక్ బ్రిటనే కాబోతోంది" అని అన్నారు.



## స్వాతంత్ర్య వేడుకల్లో నవీన్ పటేల్

జూబ్లీహిల్స్, హైదరాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మాగంటి సునీత గోపీనాథ్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ డివిజన్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నవీన్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాగంటి సునీతను శాలువాతో సత్కరించి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది

తూంపల్లి, ఆగస్టు 15 (ఈవార్తలు): విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ అయినాల శ్రీకాంత్ అన్నారు. తూంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రతి విద్యార్థిలోనూ ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగగలరని శ్రీకాంత్ అన్నారు. విద్య కేవలం మార్కులకే పరిమితం కాదని, జ్ఞానం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతను పెంపొందించే సాధనమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం, ప్రోత్సాహం అందిస్తే వారు కుటుంబంతో పాటు గ్రామానికి, సమాజానికి, దేశానికి మంచి పేరు తీసుకురాగలరన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జింక రాజేందర్, వార్డు సభ్యులు రాజు, రవి, మహేందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు హరీష్‌గౌడ్, మాజీ సర్పంచ్ దేవరాజ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.





## కరీంనగర్ డీపీఆర్వో లక్ష్మణ్ కుమార్‌కు ప్రశంసాపత్రం

కరీంనగర్, ఆగస్టు 15 (ఈవార్తలు): ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య సమాచార వారధిగా పనిచేస్తున్న కరీంనగర్ సమాచార, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీ. లక్ష్మణ్ కుమార్‌కు అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రం లభించింది. కరీంనగర్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ఆయన ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో లక్ష్మణ్ కుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. జిల్లా యంత్రాంగం, కలెక్టర్ చేపడుతున్న కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ మీడియాతో సమన్వయం చేస్తున్నారు. 2009లో ఏపీఆర్వోగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన ఆయన అనంతరం గద్వాల డీఎల్పీఆర్వోగా, హైదరాబాద్ తెలంగాణ మీడియా అకాడమీలో డీపీఆర్వోగా, హనుమకొండలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. 2025 ఫిబ్రవరిలో కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తన సేవలకు లభించిన గుర్తింపు మరింత బాధ్యతను పెంచిందని లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

## అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రజా ప్రభుత్వం

కరీంనగర్, ఆగస్టు 15 (ఈవార్తలు): అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రజా ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, కొత్త రేషన్ కార్డులు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. విద్య, వైద్యం, మహిళా సాధికారత, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులు, పోలీసు సిబ్బంది, సమాచార పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీ. లక్ష్మణ్ కుమార్ తదితరులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు.

## బోయిగూడలో జాతీయ పతాకావిష్కరణ

సికింద్రాబాద్, ఆగస్టు 15 (ఈవార్తలు): న్యూ బోయిగూడలోని పట్టణ ఆరోగ్య కేంద్రం సమీపంలో కాంగ్రెస్ నాయకుడు చిరంజీవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు డాక్టర్ శివకుమార్ లాల్, కాంతారావు, చంద్రశేఖర్, మల్లేష్, ఎంఎం రాజు, అనసూయ, నస్రీన్, శిల్ప, దీపిక, సలోమి, గజానంద్, కృష్ణ, భీమ్‌రావు, ఎస్‌ఎస్టీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే వారం భారత్‌కు బంగ్లా ప్రధాని

ఢాకా: బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రహమాన్ ఇండియాకు రానున్నారు. ఈ నెలలోనే ఆయన ఇండియాలో పర్యటించబోతున్నారు. దీనికి సంబంధించిన వివరాల్ని బంగ్లాదేశ్‌కు చెందిన ఒక మీడియా సంస్థ వెల్లడించింది.



## డిగ్రీ లెక్చరర్‌గా బూటు శ్రావణి

విజయనగరం, ఆగస్టు 15 (ఈవార్తలు): ఏపీపీఎస్సీ విడుదల చేసిన డిగ్రీ లెక్చరర్ ఫలితాల్లో విజయనగరం జిల్లా సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన బూటు శ్రావణి విజయం సాధించారు. జోన్-1లో కేవలం ఐదు పోస్టులు ఉన్న మ్యాథమెటిక్స్ విభాగంలో డిగ్రీ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. తొలి ఉద్యోగ ప్రయత్నంలోనే విజయం సాధించిన శ్రావణి చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. నానమ్మ బూటు చిన్నమ్మడు, మేనత్త బూరాడ మంగమ్మ వద్ద పెరిగారు. ఉన్నత స్థాయికి ఎదగాలన్న నానమ్మ ప్రోత్సాహంతో చదువులో రాణించారు. 2018లో ఏఎస్ఈటీ పరీక్షలో ఏయూ స్థాయిలో 11వ ర్యాంకు సాధించారు. అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో పీజీలో 2020లో టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ అందుకున్నారు. అదే ఏడాది ఏపీసెట్‌లో అర్హత సాధించి పీహెచ్‌డీలో చేరారు. ప్రస్తుతం థీసిస్ సమర్పించారు. ఉద్యోగ సాధనలో తన భర్త బూరాడ శ్రీనివాసరావు, గైడ్ కె. రాజేంద్ర ప్రసాద్, అత్తమామలు అందించిన ప్రోత్సాహం మరువలేనిదని శ్రావణి తెలిపారు. తనను చిన్ననాటి నుంచి పెంచిన నానమ్మను కోల్పోవడం ఎంతో బాధ కలిగించిందని, తన విజయాన్ని చూసి ఆమె, తన తల్లిదండ్రులు ఎంతో సంతోషించేవారని భావోద్వేగానికి గురయ్యారు.

లస్యా చిత్రం



రాశీ సింగ్



## సూర్యతో సినిమా రిక్వెస్ట్ కాదు డిమాండ్: త్రివిక్రమ్

సూర్య-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో గతంలో సినిమా ప్రయత్నం జరిగినా, కథ విషయంలో ఇద్దరికీ సెట్ కాకపోవడంతో ప్రాజెక్ట్ ముందుకు వెళ్లలేదు. తాజాగా త్రివిక్రమ్ మాట్లాడుతూ.. సూర్యకు నచ్చే కథను తాను చెప్పలేకపోయానని, అయితే త్వరలోనే ఆయనతో తప్పకుండా సినిమా చేస్తానని తెలిపారు. తన భార్య సూర్యకు పెద్ద ఫ్యాన్ అని, ఆయనతో సినిమా చేయాలని తనను కోరుతున్నారని చెప్పారు. "అది రిక్వెస్ట్ కాదు.. డిమాండ్" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అంతేకాదు, సూర్యను కలిసేందుకు తన భార్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' షూటింగ్‌కి వెళ్లి, ఆయనతో ఫొటో కూడా దిగినట్లు త్రివిక్రమ్ వెల్లడించారు.

## బేగంబజార్‌లో పంద్రాగస్టు వేడుకల్లో సోనూసూద్



హైదరాబాద్‌లోని ప్రముఖ వ్యాపార కేంద్రమైన బేగంబజార్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బేగంబజార్‌లోని 'భగత్ సింగ్ యువ సేన' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన సోనూసూద్, బేగంబజార్ ఛత్రి వద్ద జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం యువతతో కలిసి నిర్వహించిన భారీ తిరంగ ర్యాలీలో ఆయన ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ సమాజ సేవలో నిరంతరం ముందుండే సోనూసూద్, ఇలాంటి జాతీయ పండుగ వాతావరణంలో తమ మధ్య పాల్గొని యువతలో దేశభక్తి స్ఫూర్తిని నింపడం పట్ల స్థానిక ప్రజలు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

## బిగ్‌బాస్ 10.. 'దశావతారం' థీమ్

తెలుగు టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్న రియాలిటీ షో 'బిగ్‌బాస్' సరికొత్త హంగులతో పదో సీజన్‌తో సందడి చేసేందుకు సిద్ధమైంది. కింగ్ అక్కినేని నాగార్జున మరోసారి హోస్ట్‌గా వ్యవహరించనున్న ఈ సీజన్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈసారి షో మునుపటి కంటే భిన్నంగా, మరింత ఉత్కంఠభరితంగా ఉండబోతోందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ సీజన్ గురించి నాగార్జున మాట్లాడుతూ, ఇది నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని, వెరైటీ, సర్‌ప్రైజ్‌లు, డ్రామా, సవాళ్లు పదింతలు అధికంగా ఉంటాయని




తెలిపారు. ఈ సీజన్‌ను 'దశావతారం'గా అభివర్ణించిన ఆయన, ప్రతి వారం బిగ్‌బాస్ ఒక కొత్త అవతారం ఎత్తుతాడని, ఇది కంటెస్టెంట్లకు ఊహించని మలుపులను ఇస్తుందని అన్నారు. దీనికి తగ్గట్టుగానే "ఆటలో సవాల్ కాదు.. ఆటే సవాల్" అనే కొత్త ట్యాగ్‌లైన్‌ను విడుదల చేశారు. ఈ ట్యాగ్‌లైన్ షో స్వరూపాన్నే మార్చేలా ఉందనిపిస్తోంది. ప్రస్తుతం కంటెస్టెంట్ల ఎంపిక ప్రక్రియ వేగంగా జరుగుతోంది. కొంతమంది సినీ, టీవీ నటీనటులను నేరుగా ఎంపిక చేయగా, సామాన్య ప్రజల కోసం 'అగ్నిపరీక్ష' పేరుతో ప్రత్యేక ఆడిషన్లు నిర్వహిస్తున్నారు. ఈ అగ్నిపరీక్షకు న్యాయనిర్ణేతలుగా బిగ్‌బాస్ మాజీ కంటెస్టెంట్లు అయిన నవదీప్, బిందు మాధవి, అభిజీత్‌లు వ్యవహరిస్తున్నారు. వీరి పర్యవేక్షణలో సామాన్యుల నుంచి తుది జాబితాను ఖరారు చేయనున్నారు.




## ఒంటిపై జాతీయ జెండాతో 'రణబాలి'

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాను నటిస్తున్న 'రణబాలి' చిత్రం నుంచి దేశభక్తి ఉట్టిపడేలా ఉన్న ఒక పవర్‌ఫుల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. మన పూర్వీకులు స్వాతంత్ర్యం కోసం ఎంతగా పోరాడారో గుర్తుంచుకోవాలని, స్వేచ్ఛ కోసం చెల్లించిన మూల్యాన్ని ఎప్పటికీ మరువొద్దని ఆయన పిలుపునిచ్చారు. "ఇది మనందరికీ గొప్ప పండుగ రోజు. మన పూర్వీకులు స్వాతంత్ర్యం కోసం ఎంత కష్టపడ్డారో, మనం ఎంత దూరం ప్రయాణించామో గుర్తుంచుకోవాల్సిన రోజు. స్వేచ్ఛ కోసం చెల్లించిన మూల్యాన్ని ఎప్పటికీ మర్చిపోవద్దు. మీ కుటుంబాలకు, దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురండి. నా సోదరులకు, నా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు" అని విజయ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' హోస్ట్‌గా

టాలీవుడ్ కథానాయిక సమంత కొత్త జర్నీ ప్రారంభించనుంది. ఈమధ్యే 'మా ఇంటిబంగారం'తో సూపర్ హిట్ కొట్టిన సామ్.. 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' షోకు హోస్ట్‌గా వ్యవహరించనుంది. ఈ రియాలిటీ సిరీస్‌ను ఆద్యంతం సమంత నడిపింనుందని శనివారం సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ వెల్లడించింది. తమిళ చిత్ర పరిశ్రమలోని పలువురు సెలబ్రిటీలు ఈ వంట పోటీల్లో పాల్గొంటారని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ద్వారా తెలిపిందీ సంస్థ. 'మా ఇంటి బంగారం' సినిమాలో వంటరాని కోడలి పాత్రలో నటించిన సమంత ఈసారి ఏకంగా మాస్టర్ కుకింగ్ షోకు హోస్ట్‌గా వ్యవహరించనుంది. సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్‌కు సంబంధించిన సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్ షోను అన్నీతానై నడిపంచనుంది స్టార్ హీరోయిన్. ఈ కుకింగ్ షోకు హోస్ట్‌గా సమంతను పరిచయం చేస్తూ శనివారం ప్రోమోను విడుదల చేసింది సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్.






## అక్టోబర్ 9న 'కామ్రేడ్ కళ్యాణ్' రిలీజ్

విలక్షణ కథలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదల తేదీని చిత్రబృందం శనివారం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 9న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని శ్రీవిష్ణు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. "కామ్రేడ్స్! అక్టోబర్ 9న థియేటర్లలో మన 'కామ్రేడ్ కళ్యాణ్'తో 'లాల్ సలాం' చెబుదాం" అంటూ విడుదల తేదీ పోస్టర్‌ను షేర్ చేశారు. జనక్‌రామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ రచయిత కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పి పతాకంపై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992 నాటి ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమా కథ సాగనుంది. శ్రీవిష్ణు, మహిమా నంబియార్‌తో పాటు సీనియర్ నటి రాధికా శరత్‌కుమార్, మలయాళ నటుడు షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే వంటి ప్రముఖులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే 'కామ్రేడ్ కళ్యాణ్' సినిమా నుంచి జూన్‌లో విడుదలైన 'ఒరియా పిల్ల' పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. విజయ్ బుల్గానిన్ స్వరపరిచిన ఈ గీతాన్ని సిద్ శ్రీరామ్ ఆలపించగా, భాస్కరభట్ల సాహిత్యం అందించారు.




## చార్మినార్ దగ్గర గాంధీ.. 'ఫౌజీ' పోస్టర్

ప్రభాస్ సినిమాల్లో మొదటగా రాబోయేది 'ఫౌజీ'. డిసెంబరు 3న థియేటర్లలోకి రానుందని ఇదివరకే ప్రకటించారు. అయితే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గ్లింప్స్, టీజర్ లాంటిది ఏమైనా ఉంటుందేమోనని అభిమానులు ఆశపడ్డారు. కానీ మూవీ టీమ్ మాత్రం పోస్టర్‌తోనే సరిపెట్టేసింది. ఈ మేరకు దానిని సోషల్ మీడియాలో పంచుకుంది. ఈ పోస్టర్‌లో చార్మినార్ దగ్గర గాంధీజీ నడుచుకుంటూ వెళ్తుండగా మరోవైపు ఒంటిపై రక్తంతో ప్రభాస్ ఉన్నాడు. కాకపోతే ప్రభాస్ ముఖాన్ని చూపించలేదు. 'స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంతా సంబరాలు చేసుకున్నారు కానీ దానికంటే ముందు పెద్ద యుద్ధమే జరిగింది. రేపటి కోసం పోరాడిన ప్రతి సైనికుడికి సెల్యూట్' అని ఈ పోస్టర్‌కి క్యాప్షన్ జోడించారు. 'సీతారామం' తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. ఇందులో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్. విశాల్ చంద్రశేఖర్ సంగీతమందిస్తున్నాడు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇదో ప్రీరియాడికల్ యాక్షన్ లవ్ స్టోరీ అని పోస్టర్స్ చూస్తుంటే తెలుస్తోంది. అయితే గత ఏడేళ్లుగా ఇన్ స్టాలో డీపీ మార్చని ప్రభాస్.. రీసెంట్‌గానే 'ఫౌజీ' పోస్టర్‌ని డీపీ పెట్టాడు. దీంతో ఈ మూవీ సమ్‌థింగ్ స్పెషల్‌గా ఉండబోతుందని అభిమానులు అనుకుంటున్నారు.



# అగార్కర్‌కు చెక్?

టీమిండియా చీఫ్ సెలక్టర్‌గా అజిత్ అగార్కర్ పదవీ కాలాన్ని పొడిగించాలా? లేదా వద్దా? అన్న అంశంపై బీసీసీఐ త్వరలోనే ఓ నిర్ణయం తీసుకోనుంది. అతడి భవితవ్యం తెల్చేందుకు శ్రీలంకతో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత బీసీసీఐ పెద్దలు భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ అగర్కార్ కాంట్రాక్ట్‌ను బీసీసీఐ పొడిగించకపోతే అతడి స్థానాన్ని భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ భర్తీ చేసే అవకాశముందని 'ది టెలిగ్రాఫ్' తమ కథనంలో వెల్లడించింది. టెలిగ్రాఫ్ రిపోర్ట్ ప్రకారం.. తొలుత అగార్కర్ స్థానంలో లక్ష్మణ్‌ను పరిగణనలోకి తీసుకున్నారని, అయితే ప్రయాణాల భారం కారణంగా చీఫ్ సెలక్టర్ పదవిని చేపట్టడానికి అతడు చూపలేదంట. దీంతో లక్ష్మణ్‌కు 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' అనే నూతన పదవిని కట్టబెట్టేందుకు బీసీసీఐ సిద్ధమైనట్లు సమాచారం. వాస్తవానికి అగార్కర్ కాంట్రాక్ట్ ఈ ఏడాది జూన్‌తో ముగియాల్సి ఉంది. కానీ భారత క్రికెట్ బోర్డు అతడికి మూడు నెలల పొడిగింపు ఇచ్చింది. అంతేకాకుండా వన్డే ప్రపంచకప్-2027 వరకు అతడినే కొనసాగించాలని బోర్డు పెద్దలు భావించినట్లు వార్తలు వచ్చాయి. కానీ 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రకారం.. రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తు విషయంలో బీసీసీఐకి అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ మధ్య అభిప్రాయ భేదాలు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలోనే బీసీసీఐ అతడిని తప్పించే యోచనలో ఉందని ప్రచారం జరుగుతోంది.

## మంగళగిరి వేదికగా ఉమెన్స్ ఏపీఎల్

ఆంధ్రప్రదేశ్‌లో మహిళల క్రికెట్‌ను ప్రోత్సహించే దిశగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కీలక ముందడుగు వేసింది. పురుషుల కోసం విజయవంతంగా నిర్వహిస్తున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) తరహాలోనే తొలిసారిగా 'మహిళల ఏపీఎల్' నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఏసీఏ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 15 నుంచి 26 వరకు మంగళగిరి వేదికగా జరగనుంది. ఈ లీగ్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీపడనున్నాయి. ఇప్పటికే జట్ల కోసం బిడ్డింగ్ ప్రక్రియ కూడా పూర్తయిందని కేశినేని చిన్ని తెలిపారు. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఒక జట్టును రూ.89 లక్షల అత్యధిక బిడ్‌తో దక్కించుకుంది. మిగిలిన జట్లను కూడా ఇతర సంస్థలు సొంతం చేసుకున్నాయి. ఈ ప్రకటన సందర్భంగా భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా పాల్గొంది. మహిళల కోసం ప్రత్యేకంగా లీగ్ నిర్వహించడంపై ఆమె హర్షం వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో మహిళల క్రికెట్‌కు ఆదరణ బాగా పెరిగిందని, ఈ లీగ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారిణులు వెలుగులోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. జాతీయ జట్టుకు ఎంపికయ్యేందుకు ఇది ఒక మంచి వేదికగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడింది. ప్రస్తుతానికి ప్రతి జట్టు రెండేసి మ్యాచ్‌లు ఆడుతుందని, భవిష్యత్తులో ప్రేక్షకుల ఆదరణను బట్టి జట్ల సంఖ్యను పెంచే ఆలోచన ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ లీగ్‌లో ఆడేందుకు ఇప్పటికే దాదాపు 200 మంది క్రీడాకారిణులు తమ పేర్లను నమోదు చేసుకోవడం విశేషం.

## భారత్ అంటే ప్రేమ: పీటర్సన్



భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ భారతీయులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపాడు. భారత్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకుంటూ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నాడు. "నా భారతీయ స్నేహితులందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. మీ దేశం అంటే నాకు చాలా ఇష్టం. ఇక్కడి ప్రజలంటే నాకు ఎంతో ఇష్టం. జైహింద్!" అంటూ పోస్ట్ చేశాడు. భారత్‌తో తనకున్న అనుబంధాన్ని మరోసారి గుర్తుచేశాడు. భారత క్రికెట్‌తో పీటర్సన్‌కు సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆటగాడిగా ఉన్న సమయంలోనే భారత్‌లో క్రికెట్ ఆడిన కేపీ, ముఖ్యంగా ఐపీఎల్‌లో పాల్గొని భారత క్రికెట్ అభిమానులకు దగ్గరయ్యాడు. ఆ తర్వాత వ్యాఖ్యాతగా, క్రికెట్ విశ్లేషకుడిగా కూడా భారత్‌తో తన అనుబంధాన్ని కొనసాగించాడు. భారతీయుల ఆతిథ్యం, అభిమానాన్ని ఎన్నో సందర్భాల్లో ఆస్వాదించిన పీటర్సన్.. ఈసారి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షల్లో అదే అభిమానాన్ని చాటుకున్నాడు. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలువురు క్రీడాకారులు, క్రికెటర్లు భారత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అయితే పీటర్సన్ సందేశం మాత్రం దేశంపై తనకున్న వ్యక్తిగత అభిమానాన్ని ప్రధానంగా చూపించింది.

## గ్రీన్ అదృష్టవంతుడు

బంగ్లాదేశ్‌తో తొలి టెస్టులో ఆస్ట్రేలియా పోరాడుతోంది. డార్విన్ వేదికగా శనివారం నాటి మూడో రోజు ఆట పూర్తయ్యే సరికి కూడా.. బంగ్లా కంటే వెనుకబడే ఉంది. కాగా రెండు దశాబ్దాల అనంతరం ఆసీస్ గడ్డపై టెస్టు మ్యాచ్ ఆడుతున్న బంగ్లాదేశ్ అదరగొడుతున్న సంగతి తెలిసిందే. తొలి ఇన్నింగ్స్‌లో ఆతిథ్య కంగారూ జట్టును 198 పరుగులకే పరిమితం చేసిన బంగ్లాదేశ్... తమ మొదటి ఇన్నింగ్స్‌లో 426 పరుగులకు ఆలౌట్ అయింది. తద్వారా 228 పరుగుల మేర భారీ ఆధిక్యం సంపాదించింది బంగ్లాదేశ్. ఈ క్రమంలో తొలి రెండు రోజులు ఆధిపత్యం కొనసాగించిన బంగ్లా.. శనివారం నాటి మూడో రోజు ఆటలోనూ జోరు కొనసాగించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో చెలరేగిన బంగ్లా పేసర్ హసన్ మహమూద్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆసీస్‌కు చుక్కలు చూపిస్తున్నాడు. మహమూద్ బౌలింగ్‌లో ఓపెనర్లు ట్రవిస్ హెడ్ (17), జేక్ వెదర్లాండ్ (0) బౌల్డ్ అయ్యారు. మిగతా వారిలో వన్‌డౌన్ బ్యాటర్ మార్నస్ లబుషేన్ 31 పరుగులతో రాణించాడు. అయితే, తైజుల్ ఇస్లాం బౌలింగ్‌లో బౌల్డ్ అయి పెవిలియన్ చేరాడు.






# తొలి రోజు మనదే

**2 వికెట్లకు 288 పరుగులు**

### సెంచరీతో మెరిసిన పడిక్కల్.. 77 పరుగుల వద్ద కేఎల్ రిటైర్డ్ హర్ట్

**శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అద్భుత శతకంతో కదం తొక్కాడు. దాదాపు రెండేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చిన పడిక్కల్ (131 నాటౌట్), తన కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేశాడు. అతనికి తోడు వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ (77 రిటైర్డ్ హర్ట్) కూడా రాణించడంతో, శనివారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.**

**వెలుతురు లేమి, వర్షం కారణంగా ఆటను ముందుగానే నిలిపివేసే సమయానికి టీమిండియా 73 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (32), కేఎల్ రాహుల్ శుభారంభం అందించారు.**

జైస్వాల్ రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన పడిక్కల్, రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. అయితే, తీవ్రమైన కండరాల నొప్పితో కేఎల్ రాహుల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగాల్సి వచ్చింది. గాయపడిన సాయి సుదర్శన్ స్థానంలో జట్టులోకి వచ్చిన పడిక్కల్, లభించిన అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. క్రీజును చక్కగా ఉపయోగించుకుంటూ, అద్భుతమైన ఫుట్‌వర్క్‌తో లంక బౌలర్లను ఎదుర్కొన్నాడు. ముఖ్యంగా బ్యాక్ ఫుట్‌పై ఆకట్టుకునే షాట్లు ఆడాడు. 134 బంతుల్లో తన తొలి టెస్ట్ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. 2002లో సౌరవ్ గంగూలీ తర్వాత భారత జట్టులో మూడో స్థానంలో టెస్టు శతకం సాధించిన తొలి ఎడమచేతి వాటం బ్యాటర్‌గా పడిక్కల్ రికార్డు సృష్టించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (16) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. స్పిన్నర్ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో అనవసర షాట్‌కు యత్నించి మిడ్-ఆఫ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (27 నాటౌట్) తనదైన శైలిలో దూకుడుగా ఆడాడు. పడిక్కల్‌తో కలిసి అజేయంగా 52 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వర్షం కారణంగా ఆట కాసేపు నిలిచిపోయినా, బ్యాటర్ల జోరు తగ్గలేదు. అయితే, వెలుతురు మందగించడంతో అంపైర్లు తొలి రోజు ఆటను 17 ఓవర్లు ముందుగానే ముగించారు. పడిక్కల్ 178 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 131 పరుగులు, పంత్ 36 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 27 పరుగులతో క్రీజులో ఉన్నారు. రెండో రోజు ఆట 15 నిమిషాలు ముందుగా ప్రారంభం కానుండగా, భారత్ 500 పైచిలుకు స్కోరుపై కన్నేసింది.



# భారత్ శుభారంభం

**హాకీ వరల్డ్ కప్‌లో తొలి విజయం.. వేల్స్‌పై 3-1తో విన్**

పురుషుల హాకీ ప్రపంచ కప్ 2026ను భారత జట్టు విజయంతో ఆరంభించింది. శనివారం వాగెనర్ స్టేడియం వేదికగా పూల్ డి ఆరంభ మ్యాచ్‌లో వేల్స్‌పై 3-1 తేడాతో టీమిండియా గ్రాండ్ విక్టరీ సాధించింది. తొలి క్వార్టర్‌లోనే భారత ఆటగాళ్ళు పెనాల్టీ కార్నర్ల రూపంలో లభించిన అవకాశాలను భారత ఆటగాళ్లు చక్కగా వినియోగించుకున్నారు. మనజట్టుకు మొత్తం ఐదు పెనాల్టీ కార్నర్‌లు లభించగా.. మూడింటిని గోల్స్‌గా మార్చింది. తొలి క్వార్టర్‌లో సంజయ్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ చెరో రెండు పెనాల్టీ కార్నర్ గోల్స్‌తో భారత్‌ను ఆధిక్యంలోకి తీసుకెళ్లారు. రెండో క్వార్టర్‌లో ఇరుజట్లూ ఒక్క గోల్ చేయలేకపోయాయి. మూడో క్వార్టర్‌లోని 43వ నిమిషంలో హర్మన్‌ప్రీత్ తన రెండో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి 3-0తో జట్టు విజయాన్ని లాంఛనం చేశాడు. మ్యాచ్ 55వ నిమిషంలో వేల్స్ ఆటగాడు శామ్ వెల్ష్ ఓ గోల్ సాధించి తన జట్టు ఖాతా తెరిచాడు. అయినప్పటికే మ్యాచ్ వేల్స్ చేజారిపోయింది. భారత్ తమ రెండో మ్యాచ్‌లో ఆగస్టు 17న ఇంగ్లండ్‌తో తలపడనుంది.



## పంద్రాగస్టునాడు సెంచరీ.. పడిక్కల్ తొలి ఇండియన్



గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో భారత యువ బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ సూపర్ సెంచరీతో చెలరేగాడు. కేవలం 134 బంతుల్లో తన తొలి అంతర్జాతీయ సెంచరీ మార్క్‌ను పడిక్కల్ అందుకున్నాడు. ఈ క్రమంలో పడిక్కల్ అరుదైన ఘనతను తన పేరిట లిఖించుకున్నాడు. ఆగస్టు 15 (స్వాతంత్ర్య దినోత్సవం) నాడు టెస్ట్ సెంచరీ సాధించిన తొలి భారత బ్యాటర్‌గా అతడు చరిత్ర సృష్టించాడు. పడిక్కల్ కంటే ముందు భారత తరపున ఏ బ్యాటర్ కూడా ఇండిపెండెన్స్ డే రోజు టెస్టుల్లో మూడంకెల స్కోర్‌ను అందుకోలేదు. గతంలో విరాట్ కోహ్లి వెస్టిండీస్‌పై ఆగస్టు 15న వన్డే సెంచరీ చేయగా.. టెస్టు సెంచరీ చేసింది మాత్రం పడిక్కలే కావడం గమనార్హం. అదేవిధంగా 21వ శతాబ్దంలో టీమిండియా తరపున మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి టెస్ట్ సెంచరీ బాదిన రెండో ప్లేయర్‌గా పడిక్కల్ రికార్డులెక్కాడు. పడిక్కల్ కంటే ముందు సౌరవ్ గంగూలీ మాత్రమే ఈ ఘనత సాధించాడు. ఓవరాల్‌గా భారత్ తరఫున నెంబర్ 3 పొజిషన్‌లో టెస్ట్ సెంచరీ సాధించిన ఎడమ చేతి వాటం బ్యాటర్‌గా సలీమ్ దురానీ, బాపూ నాడ్కర్ణి, అజిత్ వాడేకర్, ఏక్‌నాథ్ సోల్కర్, సురీందర్ అమర్‌నాథ్, వినోద్ కాంబ్లీ పడిక్కల్ చేరాడు.

## ఆర్చరీలో భారత్‌కు స్వర్ణం

భారత యువ ఆర్చర్లు అంతర్జాతీయ వేదికపై సత్తా చాటారు. దక్షిణ కొరియాలో జరుగుతున్న రికర్వ్ మహిళల టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించారు. ప్రాంజల్ థోలియా, ఖుషి కుమావత్, యుక్త శ్రీ కొండపావులూరి (ఆంధ్రప్రదేశ్)తో కూడిన భారత జట్టు ఫైనల్లో ఆతిథ్య దక్షిణ కొరియాను 5-3తో ఓడించి టైటిల్ సొంతం చేసుకుంది. కొరియా గడ్డపైనే ఆ దేశ జట్టును ఓడించడం భారత యువ ఆర్చర్ల విజయాన్ని మరింత ప్రత్యేకంగా నిలిపింది. క్వాలిఫికేషన్ దశ నుంచి నిలకడగా రాణించిన భారత త్రయం ఫైనల్లోనూ ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంది.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# కోచింగ్ ఖర్చుకు చెక్!

వైద్య విద్యలో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ వంటి పోటీ పరీక్షలు నేడు లక్షలాది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తున్నాయి. అయితే ప్రతిభ ఒక్కటే సరిపోవడం లేదు. మంచి శిక్షణ పొందే ఆర్థిక స్థోమత కూడా విజయానికి ఒక ముఖ్యమైన అర్హతగా మారింది. వేలాది, లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు కోచింగ్ సంస్థల్లో చేరగలిగిన విద్యార్థులకు ఒక రకమైన అవకాశం.. ఆ స్థోమత లేని విద్యార్థులకు మరో రకమైన అవకాశం అనే పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరం. ఈ నేపథ్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. పేద, మధ్యతరగతి కుటుంబాలపై కోచింగ్ భారం పెరుగుతోందని పేర్కొన్న ప్రధాని.. డిజిటల్ మౌలిక వసతులు, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, బోధకులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించే దేశవ్యాప్త వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇది అమలులోకి వస్తే ముఖ్యంగా నీట్ ఆశావహులకు ఎంతో మేలు జరగవచ్చు. వైద్య విద్యపై ఆసక్తి ఉన్న గ్రామీణ, చిన్న పట్టణాల విద్యార్థులు హైదరాబాద్, విజయవాడ, ఢిల్లీ, కోటా వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. కోచింగ్ ఫీజులు, వసతి, ప్రయాణం, పుస్తకాలు వంటి ఖర్చులు కుటుంబాలపై పడే భారాన్ని కూడా గణనీయంగా తగ్గించవచ్చు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి తమ పిల్లల కలలకు అడ్డంకిగా మారకూడదన్న భావనకు ఇది బలం చేకూర్చాలి. అయితే ఉచిత కోచింగ్ ప్రకటించడం ఒక అడుగు మాత్రమే.. దాన్ని నాణ్యమైన విద్యగా మార్చడం అసలు పరీక్ష. నీట్ వంటి పరీక్షల్లో దేశవ్యాప్తంగా విద్యార్థుల మధ్య తీవ్ర పోటీ ఉంటుంది. కాబట్టి కేవలం కొన్ని వీడియో తరగతులు అందుబాటులో ఉంచితే సరిపోదు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ప్రత్యక్ష, ప్రత్యామ్నాయ తరగతులు; నాణ్యమైన అధ్యయన సామగ్రి; రోజువారీ అభ్యాస పరీక్షలు; వారానికోసారి మూల్యాంకనం; సందేహ నివృత్తి కేంద్రాలు; వ్యక్తిగత ప్రగతి నివేదికలు ఉండాలి. విద్యార్థి ఎక్కడ వెనుకబడుతున్నాడో గుర్తించి, అక్కడే అదనపు సహాయం అందించే వ్యవస్థ అవసరం. మరో కీలక అంశం డిజిటల్ అంతరం. నగరాల్లోని విద్యార్థులకు వేగవంతమైన ఇంటర్నెట్, వ్యక్తిగత కంప్యూటర్లు లేదా టాబ్లెట్లు అందుబాటులో ఉండవచ్చు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. అందువల్ల ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ నిజంగా దేశంలోని ప్రతి విద్యార్థికి చేరాలంటే మొబైల్ ద్వారా సులభంగా ఉపయోగించుకునే వేదికలు, తక్కువ డేటాతో పనిచేసే తరగతులు, ఆఫ్‌లైన్‌లో చూడగలిగే పాఠాలు, ప్రభుత్వ పాఠశాలలు--కళాశాలల్లో డిజిటల్ అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలి. అంతేకాదు, ఈ కార్యక్రమం కేవలం నీట్‌కే పరిమితం కాకూడదు. జేఈఈ, యూపీఎస్సీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్, రైల్వే, ఉపాధ్యాయ నియామకాలు వంటి వివిధ పోటీ పరీక్షలకు కూడా సమాన నాణ్యతతో శిక్షణ అందితే దేశవ్యాప్తంగా కోట్లాది యువతకు ప్రయోజనం కలుగుతుంది. ప్రధాని ప్రకటించిన కార్యక్రమం కూడా వివిధ పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ సందర్భంగా మరో ప్రశ్నను కూడా విస్మరించకూడదు. కోచింగ్ సంస్కృతి ఎందుకు ఇంత పెద్ద పరిశ్రమగా మారింది? విద్యార్థి పాఠశాలలో నేర్చుకున్న జ్ఞానం సరిపోకుండా, పరీక్షలో విజయం కోసం ప్రత్యేక కోచింగ్ తప్పనిసరిగా మారితే మన విద్యా వ్యవస్థలో ఎక్కడో లోపం ఉన్నట్టే. ఉచిత కోచింగ్ ఆ లోపానికి తాత్కాలిక పరిష్కారం కావచ్చు. కానీ దీర్ఘకాలికంగా పాఠశాలలు, కళాశాలల్లోనే నాణ్యమైన బోధనను బలోపేతం చేయాలి. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో పారదర్శకత అత్యంత అవసరం. ప్రశ్నపత్రాల లీకులు, అక్రమాలు, ఫలితాలపై అనుమానాలు విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. కోచింగ్ ఉచితంగా అందించినా పరీక్షా వ్యవస్థపై నమ్మకం లేకపోతే విద్యార్థుల ఆందోళన తొలగదు. అందువల్ల ఉచిత శిక్షణతో పాటు పారదర్శక పరీక్షా విధానం, కఠినమైన ప్రశ్నపత్ర భద్రత, వేగవంతమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ కూడా ఉండాలి. ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదు. ఒక రైతు కుమారుడు వైద్యుడు కావాలన్నా, ఒక కార్మికుడి కుమార్తె ఇంజినీర్ కావాలన్నా, ఒక చిన్న పట్టణ విద్యార్థి దేశంలోని అత్యున్నత పోటీ పరీక్షలో విజయం సాధించాలన్నా.. వారి కుటుంబ ఆర్థిక స్థితి నిర్ణయాత్మక అంశం కాకూడదు. ఉచిత కోచింగ్ అంటే కేవలం ఫీజు మాఫీ కాదు. అది అవకాశాల సమానత్వానికి వేదిక కావాలి. ప్రధాని మోదీ చేసిన ప్రకటనను ఆ దిశగా ఒక ముఖ్యమైన ఆరంభంగా చూడాలి. ఇప్పుడు అసలు బాధ్యత ప్రభుత్వానిదే. దేశంలోని ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి, ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉండేలా నాణ్యమైన వ్యవస్థను నిర్మించాలి. అప్పుడు మాత్రమే కోచింగ్ కేంద్రాల గోడలను దాటి.. దేశంలోని ప్రతి విద్యార్థి కలల గడపకు విద్య చేరినట్టవుతుంది.



# నీ స్థాయి అంతే..!

రాజకీయాల్లో విమర్శలు సహజం. ప్రత్యర్థుల విధానాలను ప్రశ్నించడం, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం, ప్రజల ముందు లెక్కలు చెప్పడం ప్రజాస్వామ్యంలో భాగమే. కానీ ఆ విమర్శలు వ్యక్తిగత దూషణల స్థాయికి చేరినప్పుడు మాత్రం ప్రజాస్వామ్య సంస్కృతి ప్రశ్నార్థకమవుతుంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రత్యర్థులను ఉద్దేశించి చేసిన "మీ బతుకు చెడ" వంటి వ్యాఖ్యలు ఈ చర్చకు కారణమయ్యాయి. సంగారెడ్డి సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు జుగుప్సాకరం. ముఖ్యమంత్రి స్థానం సాధారణ రాజకీయ పదవి కాదు. కోట్లాది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే రాజ్యాంగబద్ధ బాధ్యత. ఆ స్థానంలో ఉన్న వ్యక్తి ప్రతి మాటకూ రాజకీయ బరువుతో పాటు సామాజిక ప్రభావం ఉంటుంది. ఒక సామాన్య రాజకీయ నాయకుడు ఆవేశంలో మాట్లాడిన మాటను ఒక పార్టీ వ్యాఖ్యగా చూడవచ్చు. కానీ ముఖ్యమంత్రి నోటి నుంచి వచ్చే మాట మాత్రం ప్రభుత్వ ప్రతిష్ఠతో ముడిపడి ఉంటుంది. రాజకీయ ప్రత్యర్థులు తప్పు చేస్తే ప్రశ్నించాలి. అవినీతి జరిగితే ఆధారాలతో బయటపెట్టాలి. ప్రజాధనం దుర్వినియోగమైతే విచారణ జరిపించాలి. విధానాలు విఫలమైతే ప్రత్యామ్నాయ విధానాన్ని ప్రజల ముందు పెట్టాలి. కానీ వ్యక్తిగత దూషణతో రాజకీయ ప్రత్యర్థిని ఓడించలేరు; ఆ మాటలతో ప్రజాస్వామ్యాన్ని మాత్రం బలహీనపరుస్తారు. ఇక్కడ మరో ముఖ్యమైన విషయం ఉంది. తెలంగాణ రాజకీయాల్లో మాటల ఘర్షణ కొత్తది కాదు. ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు చేసుకోవడం గతంలోనూ జరిగింది. కానీ గతంలో జరిగిన తప్పులకు ప్రస్తుత రాజకీయ నాయకత్వం మినహాయింపు కోరలేం. ఎవరు ప్రారంభించారు? ఎవరు ఎక్కువగా దూషించారు? అనే పోటీ ప్రజలకు అవసరం లేదు. ఎవరు అధికారంలో ఉన్నా.. ప్రజాస్వామ్య భాషను కాపాడాల్సిన బాధ్యత వారిదే. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునేది తమ సమస్యలకు పరిష్కారం చూపాలని. ఉద్యోగాలు, సాగునీరు, రైతు సమస్యలు, విద్య, వైద్యం, రహదారులు, పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగం వంటి అంశాలపై సమాధానాలు కోరుతున్నారు. ఈ ప్రశ్నలకు బదులుగా రాజకీయ సభలు పరస్పర దూషణలకు వేదికలైతే అసలు ప్రజా సమస్యలు మరుగున పడతాయి. ముఖ్యమంత్రి తన ప్రత్యర్థులపై ఎంత కఠినంగా విమర్శించినా ప్రజలు వింటారు. కానీ ఆ విమర్శల్లో వాస్తవాలు ఉండాలి. గణాంకాలు ఉండాలి. ఆధారాలు ఉండాలి. పాలనా వైఫల్యాలపై ప్రశ్నలు ఉండాలి. తిట్లు ఉండాల్సిన అవసరం లేదు. ప్రత్యేకంగా తెలంగాణ వంటి రాజకీయ చైతన్యం ఉన్న రాష్ట్రంలో ప్రజలు నాయకుల మాటలను నిశితంగా గమనిస్తారు. రాజకీయ నాయకులు మాట్లాడే భాషను యువత, విద్యార్థులు, సామాన్య ప్రజలు అనుకరిస్తారు. అధికారంలో ఉన్న నాయకుడు దూషణను సాధారణ రాజకీయ భాషగా మార్చితే, దిగువ స్థాయిలో రాజకీయ సంభాషణ మరింత దిగజారే ప్రమాదం ఉంది. ప్రత్యర్థిని తిట్టడం ద్వారా రాజకీయ విజయం సాధించవచ్చని భావించడం ఒక అపోహ. ప్రజాస్వామ్యంలో అంతిమ తీర్పు ప్రజలదే. ప్రజలు ఎవరి పాలనను మెచ్చారో, ఎవరి పాలనను తిరస్కరించారో ఎన్నికల్లో చెబుతారు. నాయకులు చేయాల్సింది ఆ తీర్పును గౌరవించే స్థాయి రాజకీయ సంస్కృతిని నిర్మించడం. ముఖ్యమంత్రి పదవికి ఉన్న హుందాతనం కేవలం అధికారిక కార్యక్రమాల్లో కనిపించే ప్రవర్తనతో రాదు. ప్రత్యర్థిపై ఆగ్రహం వచ్చినప్పుడు నోటిని అదుపులో పెట్టుకోవడంలోనే నాయకత్వ పరిపక్వత కనిపిస్తుంది. రేవంత్‌రెడ్డి తన రాజకీయ ప్రత్యర్థులపై ఎంత తీవ్రంగా విరుచుకుపడాలనుకున్నా పడవచ్చు. కానీ ఆ విమర్శలకు పదును ఇవ్వాల్సింది వాస్తవాలతో.. పదజాలాన్ని అసభ్యతతో కాదు. ప్రజలు నాయకుడి ఆగ్రహాన్ని కాదు, నాయకుడి ఆలోచనను కోరుకుంటున్నారు. తెలంగాణ రాజకీయాలకు ఇప్పుడు కావాల్సింది మరో తిట్ల యుద్ధం కాదు. విధానాలపై పోటీ.. అభివృద్ధిపై పోటీ.. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పోటీ.



నవీన్ పోగుల



# రెడ్ లైన్ అంటే హింసా హెచ్చరికా?

సింధు జలాల విషయంలో పాకిస్థాన్ మరోసారి తన అసలు వైఖరిని బయటపెట్టింది. "నీటిలో ఒక్క చుక్కనూ వదులుకోం.. ఇదే మా ఎర్రగీత" అంటూ పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలు, ఆ దేశం నీటి సమస్యను ఎంతగా రాజకీయ, భద్రతా ఆయుధంగా మలచాలని చూస్తున్నదో స్పష్టం చేస్తున్నాయి. భారతదేశంతో నదీజలాల పంపకానికి సంబంధించిన ఒప్పందాన్ని శాంతి సాధనంగా చూపించుకుంటూనే.. మరోవైపు భారత్‌పై ప్రత్యక్ష ప్రతిస్పందన ఉంటుందంటూ హెచ్చరించడం పాక్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. 1960లో ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో కుదిరిన సింధు జలాల ఒప్పందం దశాబ్దాల పాటు భారత్–పాక్ సంబంధాల్లో ఎన్నో ఒడిదుడుకుల మధ్య –. యుద్ధాలు జరిగినా, ఉగ్రవాద దాడులు జరిగినా భారత్ ఈ ఒప్పందాన్ని గౌరవించింది. కానీ పాకిస్థాన్ మాత్రం ఒకవైపు ఈ ఒప్పందాన్ని అంతర్జాతీయ చట్టబద్ధతకు ప్రతీకగా ప్రచారం చేస్తూనే, మరోవైపు భారత భద్రతను దెబ్బతీసే ఉగ్రవాద కార్యకలాపాలకు నిరంతరం ఆశ్రయం కల్పించిందన్న ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. భారత్‌తో శాంతియుత సంబంధాలు కావాలని కోరుతూ, అదే సమయంలో భారత్‌పై సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ఎలా సాధ్యం? నీటిపై ఒప్పందాన్ని పాటించాలని చెప్పే దేశం, ఉగ్రవాదంపై తన బాధ్యతలను మాత్రం ఎందుకు విస్మరిస్తోంది? పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలుపుదలలో ఉంచింది. 2026 జూలైలోనూ భారత విదేశాంగ శాఖ స్పష్టంగా ఇదే వైఖరిని పునరుద్ఘాటించింది–పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదానికి మద్దతును విశ్వసనీయంగా, శాశ్వతంగా విరమించుకునే వరకు ఒప్పందం నిలుపుదలలోనే ఉంటుందని పేర్కొంది. అయితే ఇస్లామాబాద్ మాత్రం ప్రతి అంతర్జాతీయ వేదికపై "భారత్ నీటిని ఆయుధంగా మారుస్తోంది" అంటూ ప్రచారం చేస్తోంది. ఐక్యరాజ్యసమితిలోనూ ఇదే వాదనను వినిపిస్తోంది. కానీ ఒక విషయాన్ని పాకిస్థాన్ మరిచిపోకూడదు–నీటి భద్రత గురించి మాట్లాడే హక్కు ఉన్నంత మాత్రాన, పొరుగు దేశ భద్రతను నిరంతరం సవాలు చేసే హక్కు ఎవరికీ ఉండదు. పాకిస్థాన్ నేడు నీటి కొరతను ఎదుర్కొంటున్నదంటే అందుకు కేవలం భారత్‌ను నిందించడం సులభమైన రాజకీయ మార్గం. కానీ అసలు కారణాలపై ఇస్లామాబాద్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. వేగంగా పెరుగుతున్న జనాభా, వ్యవసాయ రంగంలో నీటి వృథా, పాతబడిన సాగునీటి వ్యవస్థలు, భూగర్భజలాలపై అధిక ఆధారపడటం, వాతావరణ మార్పుల ప్రభావం–ఇవన్నీ పాక్ జలభద్రతను దెబ్బతీస్తున్నాయి. వీటిని సరిదిద్దడం కంటే భారతదేశంపై నిందలు వేయడం రాజకీయంగా సులభం. ఇంకో వైపు పాకిస్థాన్ సైనిక నాయకత్వం కూడా నీటి అంశంపై కఠిన హెచ్చరికలు చేస్తోంది. దేశ నీటి వాటాను కాపాడేందుకు "అవసరమైన అన్ని చర్యలు" తీసుకుంటామని సైన్యం ప్రకటించింది. ఇది కేవలం జలవివాదం కాదని, దానిని భద్రతా సమస్యగా మార్చే ప్రయత్నం జరుగుతోందనే ఆందోళనకు కారణం. అయితే భారత్ కూడా ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తుంచుకోవాలి. నీరు కేవలం రాజకీయ ప్రతీకారం కోసం ఉపయోగించాల్సిన సాధనం కాదు. సింధు నదీ పరివాహక ప్రాంతం కోట్లాది ప్రజల జీవనాధారం. నీటి నిర్వహణలో భారత్ తన హక్కులను వినియోగించుకోవడం సహజమే. కానీ ఏ చర్య అయినా అంతర్జాతీయ జల విధానాలు, పర్యావరణ ప్రభావాలు, దిగువ ప్రాంత ప్రజల జీవన భద్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ బాధ్యతాయుతంగా ఉండాలి. అదే సమయంలో పాకిస్థాన్ కూడా ఒక కఠినమైన వాస్తవాన్ని అంగీకరించాలి. ఒక చేతిలో ఉగ్రవాదం, మరో చేతిలో జల ఒప్పందం అనే ద్వంద్వ విధానం ఇక పనిచేయదు. భారత్‌తో శాంతి కావాలంటే ముందుగా భారత్ భద్రతపై తన వైఖరిని మార్చుకోవాలి. సరిహద్దు ఉగ్రవాదానికి ముగింపు పలకాలి. పరస్పర విశ్వాసాన్ని పునరుద్ధరించాలి. నీటిని యుద్ధానికి కారణంగా మార్చడం దక్షిణాసియాకు ప్రమాదకరం. అదే నీటిని సహకారానికి వారధిగా మార్చడం మాత్రం రెండు దేశాల భవిష్యత్తును మార్చగలదు. పాకిస్థాన్ ఎంచుకోవాల్సింది బెదిరింపుల దారి కాదు.. బాధ్యతాయుతమైన సంభాషణ దారి. నీటి హక్కులపై మాట్లాడే ముందు.. పొరుగు దేశం రక్తహక్కును గౌరవించాలి. సింధు జలాలు పాకిస్థాన్‌కు జీవనాధారం కావచ్చు; కానీ భారత భద్రతకు ముప్పు కలిగించే హక్కుపత్రం మాత్రం కావు.



అలేఖ్య కట్కం


## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.